www.prajanaava.in
Telugu Daily

# ప్రజానావ

ప్రతి అక్షరం జనం కోసం..

పేజీలు : 10 | వెల రూ.5.00

ప్రజానావ ప్రతి అక్షరం జనం కోసం..
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
తెలుగు రాష్ట్రాల్లో శరవేగంగా అభివృద్ధి చెందుతున్న
ప్రజానావ దినపత్రికలో అతి తక్కువ ధరకే ప్రకటనలివ్వండి!
వివరాలకు ఈ క్రింది ఫోన్ నెంబర్లను సంప్రదించగలరు.
: 99484 33277 / 7288825681

Published from: Karimnagar, Circulated to : Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nalgonda, Mahabubnagar
హైదరాబాద్ | సంపుటి : 02 సంచిక : 107 | శుక్రవారం | 27 సెప్టెంబర్, 2024

మూడు
## సూపర్ కంప్యూటర్లు
పరమ్ రుద్ర కంప్యూటర్లను ప్రారంభించిన ప్రధాని మోడీ



2 లో..

కాంగ్రెస్ తుఫాన్‌లో
## బీజేపీ ఖతం
హర్యానా అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో రాహుల్



2 లో..

అపవిత్రం చేసి
## తిరుమలకు వెళ్తారా?
- హిందువుల మనోభావాలు దెబ్బతీసి డ్రామాలా?
- బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ ఘాటు వ్యాఖ్యలు



4 లో..



# 4కోట్ల మందికి డిజిటల్ హెల్త్‌కార్డులు

30 రోజుల్లో అందజేస్తాం

- ప్రజల హెల్త్ హిస్టరీ నమోదు చేస్తాం
- నాణ్యమైన విద్య, ఆరోగ్యమే లక్ష్యం
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం

**హైదరాబాద్ బ్యూరో, ప్రజానావ:** మరో 30 రోజుల్లో ప్రజలకు డిజిటల్ హెల్త్‌కార్డులు తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నామని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. దుర్గాబాయి దేశ్‌ముఖ్ రెనోవా క్యాన్సర్ ఆస్పత్రిని ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. విద్య, ఆరోగ్యానికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోంది. పేదలకు అతి తక్కువ ఖర్చుతో వైద్యం అందించాల్సి ఉంది. ప్రతి ఒక్కరికీ విడివిడిగా హెల్త్ ప్రొఫైల్ రూపొందించాలి. రాష్ట్రంలోని 4 కోట్ల ప్రజల హెల్త్ ప్రొఫైల్‌ను డిజిటల్కైజ్ చేయాల్సి ఉంది. ఈ హెల్త్‌కార్డుల్లో గత చికి త్స వివరాలు పొందుపరుస్తారు'అని తెలిపా రు. దుర్గాబాయి దేశ్‌ముఖ్ సంఘం ప్రతిని ధులు కూడా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టే కార్య క్రమాల్లో భాగం కావాలని కోరారు.



## పసిడి పరుగులు

**రూ.78 వేల మార్కును చేరుకున్న రేటు**


**న్యూఢిల్లీ:** దేశీయంగా పసిడి ధర మళ్లీ పరుగుల పెడుతోంది. సామాన్య లకు అందనంతగా ధరలు ఆకాశాన్ని తాకుతున్నాయి. దేశ రాజధాని ఢిల్లీలో 10 గ్రాముల మేలిమి పసిడి (24 క్యారెట్లు) ధర గురువారం మరో రూ.400 పెరిగి రూ.78 వేల మార్కును చేరుకుంది. అంతర్జాతీయం గా పసిడికి డిమాండ్ నెలకొనడం, దేశీ యంగానూ వర్తకుల నుంచి కొనుగోళ్లు కొనసాగుతుండడం పసిడి ధరలకు రెక్కలు రావడానికి కారణాలుగా మార్కెట్ నిపుణులు విశ్లేషిస్తున్నారు.

మిగతా 2 లో

# అధికారుల తప్పిదానికి సాక్ష్యం కాళేశ్వరం

2 లో..

- నాణ్యత విషయంలో రాజీపడరాదు
- 700 మంది ఏఈఈలకు నియామక పత్రాలు



సిరిసిల్ల నేతకు
## ఉరేసిన రేవంత్
- బతుకమ్మ ఆర్డర్లు బంద్ పెట్టారు
- నేతన్నల ఆత్మహత్యలు నిరోధించాం
- ఇప్పుడేమో మళ్లీ పాతరోజులు
- బీఆర్ఎస్ నేత కేటీఆర్ విమర్శలు

.. వివరాలు 2లో



# ఫార్మా సిటీ రద్దు వెనుక కోట్ల కుంభకోణం

**సిరిసిల్ల, ప్రజానావ:** హైదరాబాద్ ఫార్మా సిటీ రద్దు వెనుక వేల కోట్ల కుంభకోణం జరుగుతుందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇది పక్కా రియల్ ఎస్టేట్ దందా అని కేటీఆర్ ఆరోపించారు. ఫ్యూచర్ సిటీ పేరుతో రియల్ దందాకు సీఎం తెరలేపారని అన్నారు. ఫార్మా సిటీని రద్దు చేస్తే ఆ భూములను రైతులకు ఇచ్చేయాలని డిమాండ్ చేశారు.

మిగతా 3 లో

- ఫ్యూచర్ సిటీ పేరుతో రియల్ దందాకు పాల్పడితే సహించం
- రైతుల నుంచి సేకరించిన భూములు తిరిగి ఇచ్చేయండి
- అతిగా వ్యవహరిస్తున్న అధికారులపై చర్యలు
- మీడియా సమావేశంలో కేటీఆర్



# ఉప ఎన్నికలు రావు.. వస్తే గెలుపు మాదే

- అవినీతి, అక్రమాలకు కేరాఫ్ బీఆర్ఎస్
- పార్టీలను విలీనం చేసుకున్న ఘనత వారిదే
- ఇప్పుడు నీతి వాక్యాలు వల్లించడం విడ్డూరం
- మాజీ మంత్రి కడియం శ్రీహరి ఘాటు వ్యాఖ్యలు


**జనగామ, ప్రజానావ:**

తెలంగాణలో అవినీతి, అక్రమాలకు మారుపేరు బీఆర్ఎస్ అంటూ ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఘాటుగా విమర్శించారు. వరంగల్ చరిత్రను కనుమరుగు చేసేందుకే జిల్లాను ఆరు ముక్కలు చేశారని చెప్పారు. జిల్లాను ముక్కలు చేయొద్దని అన్నందుకే రెండోసారి తనకు మంత్రి పదవి ఇవ్వలేదని ఆరోపించారు. స్టేషన్ ఘనపూర్‌లో గురువారం మాజీమంత్రి మాట్లాడుతూ.. ప్రజాస్వామ్య వ్యవస్థను బీఆర్ఎస్ ప్రభుత్వమే కాలరాసిందన్నారు. పదేళ్లపాటు కేసీఆర్ కుటుంబం చేతిలో తెలంగాణ బందీ అయిందని విమర్శించారు.

# 4నుంచి శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలు

భారీగా ఏర్పాట్లు చేసిన టీటీడీ అధికారులు

2 లో..



## 5న పీఎం కిసాన్ నిధుల విడుదల

**న్యూఢిల్లీ:** కేంద్ర ప్రభుత్వం రైతులకు శుభవార్త తెలిపింది. పీఎం కిసాన్ 18వ విడత నిధులను అక్టోబర్ 5న విడుదల చేయనున్నట్లు గురువారం ప్రకటించింది. ఈ పథకం ద్వారా కేంద్రం ఏటా ఒక్కో రైతుకు రూ. 6 వేల చొప్పున సాయమందిస్తోంది. 2018 డిసెంబర్‌లో ఈ పథకాన్ని ప్రారంభించింది. డీబీటీ ద్వారా డబ్బులు నేరుగా రైతుల ఖాతాల్లో జమవు తున్నాయి. ప్రతి నాలుగు నెలలకొకసారి రూ. 2 వేలచొప్పున మూడు వాయిదాలలో డబ్బు ఇస్తున్నారు. పీఎం కిసాన్ యోజన 16వ విడతలో 93 మిలియన్ల మంది రైతులు ఒక్కొక్కరు రూ.2 వేల వరకు లబ్ధిపొందారు. పీఎం కిసాన్‌కు అర్హత పొందాలంటే ఈకేవైసీ తప్పనిసరి అంటున్నారు.

## మూసీ పరీవాహకంలో అధికారుల సర్వే

- అధికారుల సర్వేపై స్థానికుల ఆగ్రహం
- ఇక్కడి నుంచి తొలగిస్తే పోయేది లేదని హెచ్చరిక
- ఇంటింటి సర్వేతో మార్కింగ్ చేపట్టిన అధికారులు

3 లో..



ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం..

# సూపర్ కంప్యూటర్లు


శుక్రవారం
27 సెప్టెంబర్ 2024



## చాకలి ఐలమ్మకు సీఎం ఘన నివాళి

**ఖైరతాబాద్, ప్రజానావ:** తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధురాలు, వీరనారి చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా ఆమెకు రాష్ట్రం యావత్తూ ఘనంగా నివాళి అర్పించింది. పార్టీలకు అతీతంగా పలువురు ఆమెను స్మరించుకున్నారు. జూబ్లీహిల్స్ నివాసంలో ఆమె చిత్రపటానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆమె పోరాటాన్ని స్మరించుకున్నారు.

## అధికారుల తప్పిదానికి సాక్ష్యం కాళేశ్వరం

**అధికారులు జీవితంలో ఎలాంటి తప్పు చేయకూడదో దానికి ఉదాహరణ కాళేశ్వరం ప్రాజెక్టు అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. తెలంగాణ నీటి పారుదల శాఖలో కొత్తగా ఎంపికైన 700 మంది అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లకు సీఎం చేతుల మీదుగా నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లోని ఎర్రమంజిల్‌లో ఉన్న జలసౌధలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీఎం మాట్లాడారు. పైఅధికారులు చెప్పారని నాణ్యత, నిబద్ధత విషయంలో ఎప్పుడూ రాజీపడొద్దని అన్నారు.**

**హైదరాబాద్, ప్రజానావ:** నాణ్యత లోపిస్తే ప్రాజెక్టులు దీర్ఘకాలం నిలబడవని, నాణ్యతగా లేకుంటే.. నాగార్జున సాగర్, శ్రీశైలం ప్రాజెక్టులు ఇన్నేళ్లు ఉండేవి కావని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. దశాబ్దాల క్రితం నిర్మించిన నాగార్జున సాగర్, శ్రీశైలం ప్రాజెక్టులు లక్షల ఎకరాలకు నీళ్లు, విద్యుత్ ఇస్తున్నాయి. కానీ, ఐదేళ్ల క్రితం నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు అప్పుడే కూలిపోయింది. నిర్మాణం పూర్తి కాకముందే కూలిపోయిన కాళేశ్వరం ప్రాజెక్టును ఎలా అధ్యయనం చేయాలి. ఈ ప్రాజెక్టును గత పాలకులు ప్రపంచ అద్భుతంగా వర్ణించారు. కాళేశ్వరం విషయంలో ఎవరిని బాధ్యులుగా చేయాలి? క్షేత్రస్థాయిలో ఇంజినీర్లు సమర్థంగా పనిచేసి ఉంటే.. ఈ పరిస్థితి వచ్చేది కాదని అన్నారు. నిర్మాణ సామగ్రి నాణ్యతగా లేదని ఇంజినీర్లు వెనక్కి పంపి ఉంటే ఈ పరిస్థితి వచ్చి ఉండేది కాదు. ఒక దేశం గొప్పతనాన్ని చెప్పేది ఆ దేశంలోని నిర్మాణాలు, కట్టడాలే అని అన్నారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనలో నీళ్లు కీలకమైన అంశమని సీఎం రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. నీళ్లు మన జీవన విధానంలో ఓ భాగమని.. వ్యవసాయం, నీళ్లు తెలంగాణ ప్రజల భావోద్వేగమని అన్నారు. ఏఈఈలకు ఇది ఉద్యోగం కాదు.. భావోద్వేగమని వ్యాఖ్యానించారు. అధికారులు క్షేత్రస్థాయిలో తిరిగితే మంచి అవగాహన వస్తోందని.. క్షేత్ర స్థాయిలో తిరిగి నిర్ణయాలు తీసుకుంటే తప్పులు జరిగే అవకాశం తక్కువగా ఉంటుందని సూచించారు. నాణ్యత లోపిస్తే ప్రాజెక్టులు దీర్ఘకాలం నిలబడవని.. నాణ్యత లేకుంటే నాగార్జున సాగర్, శ్రీశైలం ప్రాజెక్టులు ఇన్నేళ్లు ఉండేవి కావన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో కట్టిన ప్రాజెక్టులు ఈ రోజు వరకు నిలబడ్డాయని అన్నారు.. ఐదేళ్ల ముందు మన కండ్లముందే కట్టిన కాళేశ్వరం ప్రాజెక్ట్ మాత్రం కూలిపోయిందని బీఆర్ఎస్‌పై ఫైర్ అయ్యారు. బీఆర్ఎస్ నేతలు గొప్పలు చెప్పిన మ్యాన్ మేడ్ వండర్ ప్రాజెక్ట్ కూలిపోయిందని ఎద్దేవా చేశారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ అంచనా వ్యయం ఎందుకు పెరిగిందని ప్రశ్నించారు. తప్పులు చేయకుండా ఉండేందుకు కొత్తగా ఎన్నికైన వాళ్లకు కాళేశ్వరం ఓ ప్రయోగశాలగా అభివర్ణించారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ విషయంలో చర్యలు తీసుకుంటే అసలు ఇరిగేషన్ డిపార్ట్‌మెంటే ఉండదని కీలక వ్యాఖ్యలు చేశారు. గత ప్రభుత్వం రూ.2లక్షల కోట్లు సాగునీటిపై ఖర్చు చేసి ప్రాజెక్టులు పూర్తి చేయలేదని ధ్వజమెత్తారు.

## ఉప ఎన్నికలు రావు.. వచ్చినా మేం సిద్ధం

(మొదటిపేజీ తరువాయి)

గతంలో పార్టీ ఫిరాయింపులకు పాల్పడిన బీఆర్ఎస్ నేతలే ఇప్పుడు కోర్టుకు వెళ్లడం విడ్డూరంగా ఉందని వ్యాఖ్యలు చేశారు. శాసనసభా పక్షాలను కలుపుకున్న చరిత్ర బీఆర్ఎస్ పార్టీది అన్నారు. తెలంగాణ ఉపఎన్నికలు రావని.. ఒకవేళ వచ్చినా కాంగ్రెస్ పార్టీ సిద్ధంగా ఉందని వెల్లడించారు. కోర్టులు, ప్రజాస్వామ్యంపై తమకు గౌరవం ఉందని వెల్లడించారు. ఈ మేరకు సంచలన వ్యాఖ్యలు చేశారు. స్టేషన్‌ఘనపూర్‌కు ఉప ఎన్నికలు వచ్చినా కాంగ్రెస్ సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించిందే బీఆర్ఎస్ అని అన్నారు. ఏకంగా శాసనసభ పక్షాలను కలుపుకున్న చరిత్ర బీఆర్ఎస్‌దని వ్యాఖ్యలు చేశారు. ఇప్పట్లో ఉప ఎన్నిక రావని.. వచ్చినా ఎదుర్కోవడానికి కాంగ్రెస్ పార్టీ సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. స్టేషన్ ఘనపూర్‌లో ఎన్నికలు వస్తే... బీఆర్ఎస్‌కు డిపాజిట్లు కూడా రావని జోస్యం చెప్పారు. కోర్టులపై, ప్రజాస్వామ్యంపై తమకు గౌరవం ఉందన్నారు. వరంగల్ చరిత్రను కనుమరుగు చేసేందుకే ఉమ్మడి జిల్లాను కేసీఆర్ ఆరు ముక్కలు చేశారని.. ఇది అడిగినందుకే తనకు రెండోసారి మంత్రి పదవి ఇవ్వలేదని తెలిపారు. కేసీఆర్ కుటుంబం చేతిలో తెలంగాణ బందీ అయిందని కడియం శ్రీహరి విమర్శలు గుప్పించారు. కాగా... రాష్ట్రంలో ఉపఎన్నికలు రాబోతున్నాయంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పదేపదే చెబుతున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని కీలక అసెంబ్లీ స్థానం స్టేషన్‌ఘనపూర్‌కు త్వరలో ఉపఎన్నిక వస్తుందని కేటీఆర్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఆ ఎన్నికల్లో తాటికొండ రాజయ్య విజయం సాధించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. అయితే 2023 తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ విజయం సాధించింది.
బీఆర్ఎస్ నుంచి కడియం శ్రీహరి పోటీచేసి విజయం సాధించారు. కానీ 2024 పార్లమెంట్ ఎన్నికల సమయానికి కడియం పార్టీకి గుడ్‌బై చెప్పేశారు. కడియం శ్రీహరికి బీఆర్ఎస్‌కు రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీలో చేరారు. కడియంతో పాటు పలువురు బీఆర్ఎస్‌కు చెందిన ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పార్టీలో చేరిన విషయం తెలిసిందే. వారిపై అనర్హత వేటు వేయాలంటూ బీఆర్ఎస్ పార్టీ హైకోర్టులో పిటిషన్ వేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో కడియం వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

## నదిలో మునిగి 43మంది మృతి

### బీహార్‌లో లోకల్ పండగలో విషాదం

**పాట్నా:** బీహార్‌లో జీవితపుత్రిక పండగ సందర్భంగా వివిధ ప్రాంతాల్లో పవిత్ర స్నానాల పేరుతో నదులు, చెరువుల్లో మునిగి 43 మంది మృతి చెందారు. మరో ముగ్గురు గల్లంతయ్యారు. మృతుల్లో 37 మంది చిన్నారులు ఉన్నారు. ఈ సంఘటనలు బుధవారం 15 జిల్లాల్లో జరిగాయి. ఇప్పటివరకు మొత్తం 43 మృతదేహాలను వెలికి తీయగలిగామని, ఇంకా గాలింపు జరుగుతోందని డిజాస్టర్ మేనేజ్‌మెంట్ విభాగం వెల్లడించింది. ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ మృతుల కుటుంబాలకు రూ. 4 లక్షల ఎక్స్‌గ్రేషియో ప్రకటించారు. తూర్పు, పశ్చిమ చంపారన్, నలందా, ఔరంగాబాద్, కైమూరు, బక్సర్, సివాన్, రోహతాస్, సరన్, పాట్నా, వైశాలి, ముజఫర్‌పూర్, సమస్తిపూర్, గోపాల్ గంజ్, అర్వాల్ జిల్లాల్లో ఈ సంఘటనలు జరిగాయి.

## పరమ్ రుద్ర కంప్యూటర్లను ప్రారంభించిన ప్రధాని మోడీ



**న్యూఢిల్లీ:** దేశీయంగా అభివృద్ధి చేసిన మూడు సూపర్ కంప్యూటర్లను ప్రధాని నరేంద్ర మోదీ ఆవిష్కరించారు. శాస్త్రీయ పరిశోధనల కోసం రూ.130 కోట్లతో పుణె, దిల్లీ, కోల్‌కతాలో ఏర్పాటు చేసిన 'పరమ్ రుద్ర' సూపర్ కంప్యూటర్లను నుంచి ఆయన దిల్లీ నుంచి వర్చువల్‌గా ప్రారంభించారు. వాతావరణ పరిశోధనల కోసం రూ.850కోట్లతో రూపొందించిన హై-పెర్ఫామెన్స్ కంప్యూటింగ్ సిస్టమ్‌ను సైతం ప్రధాని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ రోజును శాస్త్ర, సాంకేతిక రంగంలో చాలా గొప్ప విజయాలు సాధించిన రోజుగా పేర్కొన్నారు. సాంకేతిక విప్లవ యుగంలో కంప్యూటింగ్ సామర్థ్యం జాతీయ సామర్థ్యానికి ప్రత్యామ్నాయంగా మారిందన్నారు. సాంకేతిక, కంప్యూటింగ్ సామర్థ్యంపై ఆధారపడని రంగమంటూ ఏదీ లేదని తెలిపారు. ఈ సాంకేతిక విప్లవంలో మన వాటా బిట్స్, బైట్స్‌లో కాదు.. టెరా బైట్లు, పెటా బైట్లలో ఉండాలన్నారు. భారతదేశం సైన్స్, టెక్నాలజీ, పరిశోధనలకు ప్రాధాన్యమిస్తూ ముందుకు సాగుతోందన్నారు. సొంతంగా సెమీకండక్టర్ ఎకో సిస్టమ్‌ను నిర్మించడంతో పాటు ప్రపంచంలోని సరఫరా గొలుసులో కీలకంగా ఉన్నట్లు పేర్కొన్నారు. సైన్స్ ప్రాముఖ్యత కేవలం ఆవిష్కరణలు, అభివృద్ధి వరకే పరిమితం కారాదన్న ప్రధాని.. దేశంలో ఆఖరి పౌరుడి ఆకాంక్షలను సైతం నెరవేర్చేలా ఉండాలన్నారు.



## కాంగ్రెస్ తుఫాన్‌లో బీజేపీ ఖతం

### హర్యానా అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో రాహుల్

**చండీగఢ్:** దేశంలో నిరుద్యోగ సమస్య తాండవిస్తోందని లోక్‌సభ ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ అన్నారు. ప్రధాని మోదీ పక్కా ప్రణాళిక ప్రకారం ఉపాధి రంగాన్ని నిర్వీర్యం చేశారని విమర్శించారు. దేశంలో ఉద్యోగాల కొరతకు మోదీ కారణం కాదా? అని ప్రశ్నించారు. హరియాణా అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన చండీగఢ్‌లో పర్యటించారు. ప్రధాని మోదీ ప్రజలను విభజించి పాలిస్తున్నారనీ, ఒకరిని చూసి మరొకరు అసహ్యించుకునేలా తయారు చేశారని మండిపడ్డారు. హరియాణాలో భాజపా కుప్పకూలడం ఖాయమని, తాజా ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ తుపాను రాబోతోంది. అందులో భాజపా కొట్టుకుపోవడం పక్కా. రాష్ట్రాన్ని ఆ పార్టీ సర్వనాశనం చేసింది. అందుకు ప్రజలు కచ్చితంగా బుద్ధి చెబుతారు. ఇటీవల అమెరికా వెళ్లినప్పుడు అక్కడ ఉంటున్న హరియాణా వాసులను కలిశాను. డల్లాస్, టెక్సాస్‌లో ఒక్కో గదిలో 15 నుంచి 20 మంది ఉన్నారు. ఇక్కడికెలా వచ్చారని అడిగితే.. హరియాణాలో కనీసం ఉపాధి దొరకడం లేదు. ఎలాగైన బతుకుసాగించాలన్న ఉద్దేశంతో ప్రమాదకర స్థితిలో కజకిస్థాన్, తుర్కియే, దక్షిణ అమెరికా దేశాలు దాటి వచ్చి ఇక్కడ జీవనం సాగిస్తున్నామని చెప్పారు. కొందరు తమ వ్యవసాయ భూమిని విక్రయించి, ఆ డబ్బులతో అమెరికా వెళ్లినట్లు చెప్పారు. ఇక్కడే ఉపాధి అవకాశాలు ఉంటే యువతకు ఇలాంటి గతి పట్టేదా? ప్రజల తలరాతలు మారాలంటే.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావాలని అన్నారు.

## కులగణనపై ఎవరికీ అనుమానాలొద్దు

- కాంగ్రెస్ ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటుంది
- మంత్రి పొన్నం ప్రభాకర్

**హైదరాబాద్, ప్రజానావ:** కులగణనపై ఎలాంటి అనుమానాలు వద్దని, కాంగ్రెస్ పార్టీ ఎవరికీ అన్యాయం చేయదని రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. రవీంద్రభారతిలో నిర్వహించిన చాకలి ఐలమ్మ జయంతి కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. భూమి కోసం, భుక్తి కోసం , వెట్టి చాకిరి విముక్తి కోసం పోరాడిన వీరనారి ఐలమ్మ అని కొనియాడారు. కాంగ్రెస్ పార్టీ బీసీలకు అండగా ఉంటుందని, బీసీ కమిషన్ గడువు ముగిసిన వారం రోజుల్లోపే కొత్త కమిషన్ ఏర్పాటు చేసిందని గుర్తు చేశారు. కులగణన పూర్తి చేశాకే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తామని వివరించారు. ఉద్యమాల నుంచి వచ్చిన బిడ్డగా తాను బీసీలకు అన్యాయం జరగనివ్వనని అన్నారు. కొందరు కోఠీ మహిళా విశ్వవిద్యాలయానికి చాకలి ఐలమ్మ పేరు పెట్టడాన్ని జీర్ణించుకోలేక పోతున్నారని అన్నారు. మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ.. గత ప్రభుత్వ పాలన శవాల వీరిద పేలాలు ఏరుకున్నట్టుగా జరిగిందన్నారు. పదేండ్ల పాలన మేడి పండు చందంగా ఉందన్నారు. ఐలమ్మ పోరాట స్ఫూర్తితోనే అందరూ ముందుకు సాగాలని, బంగారు తెలంగాణ సాధన దిశగా అడుగులు వేయాలని అన్నారు. ఎమ్మెల్సీ కోదండరాం మాట్లాడుతూ.. గత ప్రభుత్వం బీసీ కార్పొరేషన్ ఏర్పాటు చేసింది కానీ నిధులు ఇవ్వలేదని అన్నారు.

## అమృత్ టెండర్లలో అవినీతి ఆరోపణలు

### బీఆర్ఎస్ నేత కేటీఆర్‌కు లీగల్ నోటీసులు


**హైదరాబాద్, ప్రజానావ:** అమృత్ టెండర్లలో అవినీతికి పాల్పడ్డారంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన వ్యాఖ్యలపై ఆయనకు లీగల్ నోటీసులు అందాయి. తెలంగాణ ప్రభుత్వం శోధ కంపెనీకి ఇచ్చిన అమృత్ పథకం టెండర్లలో అవినీతి జరిగిందన్న ఆరోపణలపై సుజన్ రెడ్డి ఈ నోటీసులు ఇచ్చారు. తన పరువుకు భంగం కలిగించేలా వ్యాఖ్యలు చేసినందుకు కేటీఆర్‌తో పాటు బీఆర్ఎస్ పార్టీకి నోటీసులు అందించారు. తప్పుడు వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలని సృజన్ రెడ్డి డిమాండ్ చేశారు. కాగా గత కొంత కాలంగా.. తెలంగాణ ప్రభుత్వం అమృత్ టెండర్లలో అవినీతికి పాల్పడుతోందని ఆరోపిస్తూ వెంటనే విచారణ చేపట్టి.. నిజాలను బహిర్గతం చేయాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కేంద్రాన్ని డిమాండ్ చేస్తున్న విషయం తెలిసిందే. రేవంత్ రెడ్డి అధీనంలో ఉన్న పురపాలక శాఖ ద్వారా కేంద్రం అమలు చేస్తున్న అమృత్ టెండర్ల విషయంలో భారీగా అక్రమాలకు పాల్పడ్డారని కేటీఆర్ ఆరోపించారు. రేవంత్ రెడ్డి అధికారాన్ని అడ్డుపెట్టుకొని బంధువులకు మోసపూరితంగా వందల కోట్ల కాంట్రాక్టులు దక్కేలా చేశారనేది ఆయన ప్రధాన ఆరోపణ. రేవంత్ కుటుంబానికి సంబంధించి అర్హత లేని కంపెనీలకు కాంట్రాక్టులు కేటాయించారని కేటీఆర్ అన్నారు. సీఎం బావమరిది సృజన్‌రెడ్డికి చెందిన సంస్థకు ఏకంగా రూ.8 వేల 888 కోట్ల విలువైన టెండర్‌ను అక్రమంగా కట్టబెట్టారన్నారు. కేటీఆర్ చేసిన ఆరోపణలను కాంగ్రెస్ నేతలతో పాటు, బీఆర్ఎస్ నేత, మాజీ ఎమ్మెల్యే కందాల ఉపేందర్ రెడ్డి ఖండించారు. ఈ అంశంపై కేటీఆర్‌కు ఎవరో తప్పుడు సమాచారం ఇచ్చారని, సృజన్... రేవంత్ రెడ్డికి సొంత బావమరిది కాదని, తనకు అల్లుడని చెప్పారు. సృజన్‌కు రాజకీయాలతో సంబంధం లేదని వివరించారు.



## 4నుంచి శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలు

### భారీగా ఏర్పాట్లు చేసిన టిటిడి అధికారులు

**తిరుమల, ప్రజానావ:** కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వేంకటేశ్వరుడు కొలువైన నేల తిరుమలలో బ్రహ్మోత్సవాల షెడ్యూల్ విడుదల అయింది. టీటీడీ గురువారం ఈ షెడ్యూల్‌ను రిలీజ్ చేసింది. అక్టోబర్ 4 నుండి 12వ తేదీ వరకు శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. ఇందుకు సంబంధించి టీటీడీ భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేస్తుంది. అక్టోబర్ 4న ధ్వజారోహణం, అక్టోబర్ 8న గరుడసేవ, అక్టోబర్ 9న స్వర్ణరథం, 11న రథోత్సవం, అక్టోబర్ 12న చక్రస్నానం నిర్వహించనున్నారు. ప్రతి రోజు ఉదయం 8 గంటలకు, సాయంత్రం 7 గంటలకు వాహనసేవలు ప్రారంభమవుతాయి. రోజూ ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం స్వామివారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారు. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని కొండపైకి వచ్చే వాహనాలపై ట్రాఫిక్ పోలీసులు ఆంక్షలు విధించారు. అక్టోబర్ 7 రాత్రి 11 గంటల నుంచి అక్టోబర్ 8 అర్ధరాత్రి వరకు ద్విచక్ర వాహనాల రాకపోకలపై నిషేధం విధిస్తారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా టీటీడీ.. ప్రత్యేక దర్శనాలు, వీఐపీ బ్రేక్ దర్శనాలు రద్దు చేయనుంది.



## పసిడి పరుగులు

(మొదటిపేజీ తరువాయి)

బుధవారం రూ.77,850 వద్ద ముగిసిన బంగారం ఇవాళ మరో రూ.400 పెరిగి తాజా గరిష్ఠమైన రూ.78,250 మార్కును దాటినట్లు ఆల్ ఇండియా సరాఫా అసోసియేషన్ తెలిపింది. మరోవైపు వెండికీ పసిడితో సమానంగా డిమాండ్ కొనసాగుతోంది. కిలో వెండి తాజాగా మరో వెయ్యి రూపాయలు పెరిగి రూ.94వేల మార్కు చేరుకోవడం గమనార్హం. అంతర్జాతీయ కమొడిటీ ఎక్స్ఛేంజీలో బంగారం ఔన్సు 2701 డాలర్లు పలుకుతోంది. ద్రవ్యోల్బణం కట్టడికి ఇన్నాళ్లూ వడ్డీ రేట్లు పెంచుకుంటూ వచ్చిన కేంద్ర బ్యాంకులు... ఇప్పుడు వృద్ధికి ఊతం ఇచ్చేందుకు వడ్డీ రేట్లను తగ్గించేందుకు ముందుకొస్తున్నాయి. దీనికి తోడు పశ్చిమాసియాలో మరోసారి ఉద్రిక్త పరిస్థితులు నెలకొనడం కూడా పసిడికి డిమాండ్ ఏర్పడిందని హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్‌లో సీనియర్ అనలిస్ట్ సౌమిల్ గాంధీ పేర్కొన్నారు. డాలరు ధర క్షీణించడం కూడా మరో కారణమని తెలిపారు.

# రాష్ట్రంలో రెండ్రోజులు భారీ వర్షాలు

**ఖైరతాబాద్, ప్రజానావ:** ఉత్తర తెలంగాణలోని 14 జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాముందని వాతావంణశాఖ వెల్లడించింది. ఈ మేరకు ఆయా జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు జారీ చేసింది. ఆదిలాబాద్, కొమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, జయశంకర్ భూపాలపల్లి, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్, జనగాం, సిద్దిపేట, కామారెడ్డి జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన భారీ వర్షాలు కురుస్తాయని తెలిపింది. గురువారం ఆదిలాబాద్, కొమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, కామారెడ్డి జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన భారీ వర్షాలు వచ్చే అవకాశముందని వాతావంణశాఖ పేర్కొంది. గంటకు 40 నుంచి 50 కి.మీ వేగంతో గాలులూ వీస్తాయని వెల్లడించింది. బుధవారం హైదరాబాద్‌లోనూ తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు,



గురువారం తేలికపాటి వర్షాలు కురిసే అవకాముందని తెలిపింది. పశ్చిమ - మధ్య బంగాళాఖాతం దాని పరిసర వాయువ్య బంగాళాఖాతంలో కొనసాగిన అల్పపీడనం బుధవారం బలహీనపడినట్లు తెలిపింది.




# మూసీ పరీవాహకంలో అధికారుల సర్వే

### స్థానికుల ఆగ్రహం
### ఇక్కడి నుంచి తొలగిస్తే పోయేది లేదని హెచ్చరిక
### ఇంటింటి సర్వేతో మార్కింగ్ చేపట్టిన అధికారులు

**హైదరాబాద్, ప్రజానావ:** రాజధానిలో మూసీ నది పరివాహక ప్రాంతాల్లో ఉద్రిక్తత నెలకొంది. భారీ పోలీసు బందోబస్తు మధ్య అధికారులు సర్వే చేపట్టారు. మూడు జిల్లాల పరిధిలో మొత్తం 25 ప్రత్యేక సర్వే బృందాలు పర్యాటిస్తున్నాయి. హైదరాబాద్ జిల్లా పరిధిలో 16 బృందాలు, రంగారెడ్డి జిల్లాలో నాలుగు, మేడ్చల్‌లో 5 బృందాలు సర్వే చేస్తున్నాయి. నదీ గర్భంలోని నిర్వాసితుల నిర్మాణాల వివరాలను రెవెన్యూ అధికారులు అడిగి తెలుసుకున్నారు. మూసీ నదిలో ఉన్న బఫర్ జోన్‌లోని నిర్మాణాలకు మార్కింగ్ చేస్తున్నారు. చాదర్‌ఘాట్, మూసానగర్, శంకర్‌నగర్‌లోని మూసీ పరివాహక ప్రాంతాల్లో అధికారులు సర్వే చేపట్టారు. హిమాయత్‌నగర్ తహసీల్దార్ సంధ్యారాణి ఆధ్వర్యంలో ఇది కొనసాగుతోంది. గోల్కొండ పరిధిలోని ఇబ్రహీంబాగ్ ప్రాంతంలోనూ సర్వే చేశారు. లంగర్‌హౌస్ డిఫెన్స్ కాలనీలో అధికారులు సర్వే చేస్తున్నారు. రివర్‌బెడ్‌లో నిర్మాణాలకు మార్కింగ్ చేస్తున్నారు. ఇప్పటికే 13 వేలకుపైగా ఆక్రమణలను ప్రభుత్వం గుర్తించింది. అర్హులైన పేదలకు పునరావాసం కల్పించేందుకు వివరాలు సేకరిస్తున్నారు. మూసీ సుందరీకరణలో భాగంగా నదీ పరిసరాల్లో సుమారు 40వేల ఇండ్లు చెదిరి పోనున్నాయి. కాగా, ప్రాణాలైనా ఇస్తాం కానీ.. హైడ్రా బుల్డోజర్లను రానిచ్చేది లేదంటూ మూసీ పరీవాహక ప్రాంత వాసులు హెచ్చరించారు. తమకు డబుల్ బెడ్రూం ఇండ్లు అవసరం లేదని స్పష్టం చేసారు. రూపాయి రూపాయి పోగు చేసుకొని ఇల్లు కట్టుకున్నామని చెబుతున్నారు. మూసీ వెంట ఉన్నది అందరం లేబర్లమేనని, తమను తీసుకొని ఎక్కడో వేస్తే ఏం చేసుకొని బతకాలని ప్రశ్నించారు. డబుల్ బెడ్రూం అందజేసే ప్రక్రియకు నెలల తరబడి సమయం పడుతుందని, అప్పటి వరకు తాము ఎక్కడ ఉండాలి, ఎలా బతకాలని ప్రశ్నిస్తున్నారు. ఇన్నేండ్లలో ఎప్పుడు ఇలాంటి మనసులేని సీఎంను చూడలేదని వాపోతున్నారు. రేవంత్ రెడ్డికి తగిన బుద్ధి చెప్పే రోజులు వస్తాయని హెచ్చరించారు. మరోవైపు ఆపరేషన్ మూసీ పనులు జోరందుకున్నాయి. మూసీ ప్రక్షాళనపై రాష్ట్ర సర్కార్ స్పీడ్ పెంచింది. మూసీ వద్ద ఉన్న ఆక్రమణలు తొలగించిన వెంటనే సుందరీకరణ పనులపై ప్రభుత్వం దృష్టిసారించింది. ఇందులో భాగంగా మూసీ నిర్వాసితుల గుర్తింపు కోసం సర్వే కొనసాగుతోంది. పునరావాసం తర్వాతే ఇళ్ళు కూల్చివేయాలని సర్కార్ నిర్ణయించింది. అర్హులైన కుటుంబాలకు డబుల్ బెడ్రూం ఇళ్ళు ఇవ్వాలని ఇప్పటికే ప్రభుత్వం నిర్ణయించింది. మూసీ నదిని ఆక్రమణ నుంచి విడిపించేందుకు సర్కార్ చర్యలు చేపట్టింది. మూసి రివర్ బెడ్‌లో 2,166 ఇళ్లు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. అయితే అత్యధికంగా హైదరాబాద్ జిల్లా పరిధిలో ఆక్రమణలను అధికారులు గుర్తించారు. మరోవైపు మూసీ నివాసితుల ప్రాంతాల్లో ఉదయం నుంచి హైటెన్షన్ వాతావరణం నెలకొంది. మూసీ బాధితుల వివరాలు సేకరించడానికి అధికారులు రంగంలోకి దిగగా.. నివాసులు అడ్డుకుంటున్నారు. గురువారం ఉదయం మూసీ రివర్ బెడ్‌లో 25 ప్రత్యేక సర్వే బృందాలు చేరుకున్నాయి. ఒక్కో టీమ్‌లో తహసీల్దార్‌తో పాటు ఐదుగురు ఆఫీసర్లు ఉన్నారు. రివర్ బెడ్‌లో మొత్తం 2,166 ఇళ్లను అధికారులు గుర్తించారు. ఎఫ్‌టీఎల్ నిర్మాణాలకు డబుల్ బెడ్ రూం ఇళ్లు.. బఫర్ జోన్‌లో నిర్మాణాలకు ఇళ్ళతో పాటు నష్టపరిహారం చెల్లించేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. అయితే పలు ప్రాంతాల్లో సర్వే కోసం వచ్చిన అధికారులను స్థానికులు అడ్డుకుంటున్నారు. దీంతో మూసీ నివాసితుల సర్వే అధికారులకు సవాల్‌గా మారింది. భారీ పోలీసు బందోబస్తు మధ్య ఇళ్లను అధికారులు మార్క్ చేస్తున్నారు. మూసీ ఆక్రమణలపై తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఆక్రమణలను తొలగించేందుకు ప్రత్యేక కార్యాచరణను రూపొందించినట్లు మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండీ దాన కిషోర్ తెలిపారు. ఈ నిర్మాణాలను తొలగించాలని నిర్ణయించినట్లు చెప్పారు. అయితే, ఇందుకోసం మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా ఒక కార్యాచరణను రూపొందించినట్లు దాన కిషోర్ తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు ప్రతి ఒక్క నిర్వాసితులకు డబుల్ బెడ్రూమ్ ఇళ్లను మంజూరు చేసి పునరావాసం కల్పిస్తామని ప్రకటించారు.

## చెరువులో విలాస భవనం

### బాంబులతో కూల్చివేత

**సంగారెడ్డి, ప్రజానావ:** సంగారెడ్డి జిల్లా కొండాపూర్ మండలం మల్కాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని మధిర గ్రామం కుతుబ్‌శాయి పేట్ గ్రామంలో రెవెన్యూ, నీటిపారుదల శాఖ అధికారులు అక్రమ నిర్మాణాన్ని గుర్తించారు. కొందరు వ్యక్తులు చెరువులోనే బహుళ అంతస్తుల భవనం కట్టడంతో చర్యలు తీసుకున్నారు. బాంబుల ద్వారా అక్రమ కట్టడాన్ని నేలమట్టం చేశారు. ఈక్రమంలో బాంబులు పేలి శిథిలాలు ఎగిరిపడటంతో ఇద్దరికి గాయాలయ్యాయి. సికింద్రాబాద్‌కు చెందిన వ్యక్తి 12 సంవత్సరాల క్రితం మల్కాపురం పెద్దచెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో ఈ భవనాన్ని



నిర్మించారు. నీళ్లలో అడుగుపెట్టకుండా లోనికి వెళ్లడానికి కొంత దూరం నుంచే మెట్లు కట్టారు. యజమాని కుటుంబ సభ్యులు వారాంతాల్లో వచ్చి ఇక్కడ సేదతీరుతూ ఉండేవారు.

# జర్నలిస్టుల అక్రిడేషన్ గడువు 3 నెలలు పొడిగింపు

**ఖైరతాబాద్, ప్రజానావ:** రాష్ట్రంలో వర్కింగ్ జర్నలిస్టుల అక్రిడేషన్ గడువును మరో 3 నెలల పాటు పొడిగిస్తూ రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్ హనుమంత రావు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నెల 30తో అక్రిడేషన్ కార్డుల గడువు ముగియనుంది. తదితర కారణాల వల్ల ఈ గడువును మరో మూడు నెలల పాటు పొడిగిస్తున్నట్లు ఐ అండ్ పీఆర్ అధికారులు పేర్కొన్నారు. అక్టోబర్ 1 నుంచి డిసెంబర్ 31 వరకు అక్రిడేషన్ల గడువును పొడిగిస్తూ ఆయా జిల్లాల కలెక్టర్లు, ఆర్టీసీ సంస్థకు అధికారులు తెలియజేశారు.

# ఫార్మా సిటీ రద్దు వెనుక కోట్ల కుంభకోణం

- ఫ్యూచర్ సిటీ పేరుతో రియల్ దందాకు పాల్పడితే సహించం
- రైతుల నుంచి సేకరించిన భూములు తిరిగి ఇచ్చేయండి
- అతిగా వ్యవహరిస్తున్న అధికారులపై చర్యలు తప్పవు
- మీడియా సమావేశంలో కేటీఆర్



**సిరిసిల్ల, ప్రజానావ:** హైదరాబాద్ ఫార్మా సిటీ రద్దు వెనుక వేల కోట్ల కుంభకోణం జరుగుతుందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇది పక్కా రియల్ ఎస్టేట్ దందా అని కేటీఆర్ ఆరోపించారు. ఫ్యూటచర్ సిటీ పేరు తో రియల్ దందాకు సిఎం రేంవత్ తెరలేపారని అన్నా రు. ఫార్మా సిటీని రద్దు చేస్తేఆ భూములను తిరిగి రెతుల కు ఇచ్చేయాలని డిమాండ్ చేశారు. రాజన్న సిరిసిల్లలోని బీఆర్ఎస్ భవన్‌లో కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. ఫార్మా సిటీని రద్దు చేస్తామని చెప్పి కాంగ్రెస్ పార్టీ చాలా స్పష్టంగా ఎన్నికలకు ముందు చెప్పింది. ఇబ్రహీంపట్నం, మహేశ్వరంతో పాటు ఇతర వేదికల ద్వారా రేవంత్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి.. చాలా మంది నాయకులు స్పష్టంగా చెప్పారు. బీఆర్ఎస్ ప్రభు త్వం రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తుందని ఇష్టమొచ్చినట్లు మాట్లాడారని కేటీఆర్ గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత.. ఫార్మా సిటీ రద్దు అని సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు శ్రీధర్ బాబు, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ప్రకటనలు చేశారు. అయితే ఫార్మా సిటీ ఉన్నదా..? పోయిందా..? అని కొందరు రైతులు హైకోర్టును ఆశ్ర యించారు. దీంతో ఇదే కాంగ్రెస్ ప్రభుత్వం ఫార్మా సిటీ రద్దు కాలేదు.. అట్లనే ఉందని నిన్న హైకోర్టులో పిటిషన్ వేసింది. నేను ఈ ప్రభుత్వాన్ని ఒక్కటే సూటిగా అడుగు తున్నా.. సీఎం ఎక్కడ మాట్లాడినా ఉన్న సిటీ గురించి మాట్లాడడం లేదు. ఫ్యూచర్ సిటీ, ఏఐ సిటీ, ఫోర్త్ సిటీ అని మాట్లాడుతున్నాడు. సీఎం రేవంత్ రెడ్డి చెప్పు చేతనైతే.. నీ భాషలో చెప్పాలంటే మొగోడివి అయితే చెప్పు.. నీవు చెప్పే ఫోర్త్ సిటీ, ఫ్యూచర్ సిటీ, ఏఐ సిటీ కోసం ఒక్క ఎకరమైనా భూసేకరణ చట్టం కింద సేకరిం చావా..? మీరు ఒక్క ఎకరం భూమి సేకరించకపోతే, మేం గతంలో ప్రతిపాదించిన ఫార్మా సిటీ భూమే అయితే దాన్ని ఇతర అవసరాలకు ఎలా మళ్లిస్తావు..? చివరకు న్యాయమూర్తులను కూడా తప్పుదోవ పట్టిస్తున్నావు. ఇవన్నీ ప్రజలు గమనిస్తున్నారు అని కేటీఆర్ తెలిపారు. నువ్వు గతంలో చెప్పిన మాట ప్రకారం.. ఫార్మా సిటీని రద్దు చేసిన మాట నిజమే అయితే.. ఆ భూములను రైతులకు తిరిగిచ్చే పని చేయ్. అలా కాకుండా ఫోర్త్ సిటీ కడుతా.. ఫిఫ్త్ సిటీ కడుతా.. మా ఫోర్ బ్రదర్స్‌కు రియల్ ఎస్టేట్ దందాకు వాడుతా అంటే రైతులు ఊరుకోరు. ఏ రైతులైతే నీకు ఓటేశారు.. వారే నీ పార్టీ అంతు చూస్తారు. రేపు ప్రభుత్వం కోర్టులో స్పష్టంగా చెప్పాలి. లక్షలాది మం దికి ఉపాధి కల్పించే ఫార్మా సిటీ కడుతున్నారా..? లేదా..? అదే విధంగా కోర్టు కూడా నోటీసు చేయాలని న్యాయమూర్తులకు విజ్ఞప్తి చేస్తున్నాను. ఫార్మా సిటీ కోసం ఏడేండ్లు కష్టపడి రైతులను ఒప్పించి, మెప్పించి.. నానా తంటాలు పడి సేకరించిన 14 వేల ఎకరాల్లో 64 వేల కోట్ల పెట్టుబడులు రావాలని లక్షలాది మంది ఉద్యోగ ఉపాధి అకాశాలు రావాలని ఫార్మాసిటీని ప్రతిపాదించామని కేటీఆర్ తెలిపారు. ఫార్మా సిటీ కోసం ఆనాడు సేకరించిన 14 వేల ఎకరాలు కండిషనల్ ల్యాండ్ అక్విజిషన్ కింద తీసుకున్నాము. అంటే ఫార్మా సిటీ కోసమే మేము తీసు కుంటున్నాము అని స్పష్టంగా జీవోలో పేర్కుంటూ ఫార్మా సిటీ కోసం భూములను తీసుకున్నాం. ఇవాళ ఆ భూము లను రియల్ ఎస్టేట్ దందా కోసం, ఫ్యూచర్ సిటీ అనే డ్రామాల కోసం, ఫోర్త్ సిటీ అనే హంగామా కోసం, ఏఐ సిటీ అనే హడావుడి కోసం మళ్లించి దాంట్లో నుండి వేల కోట్లు నొక్కేయాలనే ఆలోచన ప్రభుత్వం చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇది పక్కా రియల్ ఎస్టేట్ స్కాం.. దీన్ని న్యాయమూర్తులు గమనించాలని కోరుతున్నాను. భూ దందాలను తప్పకుండా బయటపెడుతాం. ఫార్మా సిటీ విషయంలో ప్రభుత్వాన్ని అడుగుతున్నా.. ఫార్మా సిటీని కొనసాగిస్తే 14 వేల ఎకరాల్లో ఉండాలి లేదా రద్దు చేస్తే ఆ భూమి రైతులకు తిరిగి ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నాను అని కేటీఆర్ పేర్కొన్నారు. ఇప్పుడు అహంకారంతో అడ్డగోలుగా అధికారాన్ని దుర్వినియోగం చేస్తున్న అధికా రులకు శిక్ష తప్పదు.. రిటైర్ అయినా రికవరీ చేయించే బాధ్యత తానే తీసుకుంటానని కేటీఆర్ హెచ్చరించారు. అధికారులు కాంగ్రెస్ పార్టీ నాయకుల్లా, కార్యకర్తల మాది రి అత్యుత్సాహం ప్రదర్శి స్తున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చిన్న చిన్న పల్లెలను గ్రామపంచాయతీలుగా మార్చి 54 కొత్త రేషన్ దుకాణాలు ఏర్పాటు చేశాం. ఆ రేషన్ దుకాణాలను స్థానికంగా ఉండే పొదుపు సంఘా లకు అప్పజెప్పాం. తద్వారా వారికి కొంత ఆదాయం వస్తదని అప్పజెప్పాం. మరి నువ్వేం చేశావు. ఇక్కడున్న కాంగ్రెస్ నాయకుడు తానే రాజు, తానే మంత్రి అన్నట్టు.. నేనే ప్రభుత్వాన్ని నడుపుతున్న అన్నట్టు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ఆయనకు అధికారులు వంతపాడుతూ ఆగమాగం అవుతున్నారు. మొన్న ఏపీలో ఏం జరిగిందో చూడండి.. ఆలిండియా సర్వీస్ ఆఫీసర్లు కూడా సస్పెం డ్ అయ్యారు. చట్టం ప్రకారం కాకుండా ఇష్టమొచ్చినట్టు చేస్తాం అంటే తప్పకుండా ఫలితం అనుభవిస్తారు. ఆలిండియా సర్వీసు ఆఫీసర్లు, పోలీసులు, ఆర్డీవోలు, కలెక్టర్లు ఎవరైనా ఫలితం అనుభవిస్తారు. చట్టం ప్రకారం, ఒళ్లు దగ్గర పెట్టుకోని పని చేయండి. ఇష్టమొచ్చినట్లు చేస్తామంటే ఊరుకోం. మరో నాలుగేండ్లలో మళ్లీ కేసీఆర్ తిరిగి వస్తరు.. మీ సంగతి తప్పకుండా చూస్తాం అని కేటీఆర్ హెచ్చరించారు. కలెక్టర్, ఆర్డీవోను అడుగుతు న్నా.. 54 రేషన్ దుకాణాలకు 480 మంది దరఖాస్తు చేసుకున్నారు. పారదర్శకత పాటించకుండా లక్షల రూపా యాలకు ఆ పోస్టులను అమ్ముకున్నారని కాంగ్రెస్ నాయ కులే ప్రెస్‌మీట్లు పెట్టి ఆరోపిస్తున్నారు. అర్హత ఉన్న బాధి తులేమో వాటర్ ట్యాంక్‌లు ఎక్కి నిరసన వ్యక్తం చేస్తున్నా రు. కలెక్టర్‌ను, స్థానిక మంత్రులను ఈ విషయంలో సూటిగా అడుగుతున్నా.. రాతపరీక్ష పెట్టామని అంటున్నా రు కదా.. మెరిట్ లిస్ట్ బయటపెట్టండి.. వెంటనే జాబితా ప్రకటించండి. పీజీలు, డిగ్రీలు చదువుకున్నోళ్లకు మార్కు లు రావట. పదో తరగతి పాసైన వారికి మార్కులు వస్తా యట.. కాంగ్రెస్ కండువా కప్పుకుంటే, లక్షలు సమర్పిం చుకుంటే మార్కులు వస్తాయట. ఇంత దిక్కుమాలిన రాజకీయాలు చేస్తారా..? లక్షల రూపాయాలకు పోస్టుల ను అమ్ముకుంటారా..? మళ్లీ మా టైం వస్తది.. తప్ప కుండా అధికారులకు శిక్ష పడుతది. రిటైర్ అయినా రిక వరీ చేయిస్తాం.. అతి చేసే వారికి మిత్తితో సహా చెల్లిస్తాం. రేషన్ దుకాణాల బాధితుల తరఫున హైకోర్టును ఆశ్రయి స్తాం అని కేటీఆర్ స్పష్టం చేశారు.

# సిరిసిల్ల నేతకు ఉరేసిన రేవంత్

- బతుకమ్మ ఆర్డర్లు బంద్ పెట్టారు
- నేతన్నల ఆత్మహత్యలు నిరోధించాం
- ఇప్పుడేమో మళ్లీ పాతరోజులు వచ్చాయ్
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శలు



**సిరిసిల్ల, ప్రజానావ:** రాష్ట్రం ఏర్పడ్డాక ఎనిమిదేండ్ల పాటు సిరిసిల్ల నేతన్నలను అన్ని రకాలుగా ఆదుకుని, చేతి నిండా పని కల్పించామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశా రు. సిరిసిల్లను మరో తిర్పూర్ చేయాలని సంక ల్పించాం.. కానీ ఈ పిచ్చోడికి అర్థం కావడం లేదని కేటీఆర్ మండిపడ్డారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలోని బీఆర్ఎస్ కార్యాలయంలో కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. ఉమ్మడి రాష్ట్రంలో జరిగినట్టు తెలంగాణలో ఆత్మహత్యలు జరగొద్దని చెప్పి ఎనిమిదేండ్ల పాటు 3,312 కోట్ల ఆర్డర్లు సిరిసిల్లకు ఇచ్చారు. దీంతో ఆత్మహత్యలు బంద్ అయ్యాయి. ఆదాయం డబుల్ అయింది. ఈ క్రమంలోనే ఆధునీకరణ వైపు ఆలోచనలను చేస్తూ సిరిసిల్లను మరో తిర్పూర్ చేయాలని కేసీఆర్ సంకల్పించారు . రెండు మూడు బస్సుల్లో తమిళనాడులోని తిర్పూర్, కోయంబత్తూరుకు నేతన్నలను పంపించాం. ఎందుకంటే మరో తిర్పూర్ మాదిరిగా సిరిసిల్లను తీర్చిదిద్దాలనే ఉద్దేశంతో. జీతాలు డబుల్ అయి, ఆత్మహత్యలు ఆగి ఇప్పుడిప్పుడు ముఖం తెలివికి వస్తున్న సమయంలోనే మా ప్రభుత్వం పోయి దిక్కుమాలిన కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చింది అని కేటీఆర్ తెలిపారు. నా మీద కోపంతో.. ఆ కక్షను సిరిసిల్ల ప్రజలు, నేతన్నల మీద తీర్చుకుంటున్నారు రేవంత్. మొత్తం బతుకమ్మ చీరలు ఆర్డర్లు బంద్ చేశారు. బతుకమ్మ చీరల్లో కుంభకోణం లంబకోణం జరిగిందని డైలాగ్‌లు కొట్టారు. ఎంక్వైరీ చేసుకోమని శాసనసభా వేదికగా చెప్పాను. సూరత్ నుంచి తీసుకొచ్చారని సీఎం సన్నాయి నొక్కులు నొక్కబోతే.. మొదటి ఏడాది కొంత తెచ్చాం.. ఆ రోజున్న డైరెక్టరే, ఇప్పుడు సెక్రటరీగా ఉన్నారు. ఎంక్వైరీ చేసుకోమని చెప్పాను. కానీ ముందుకు రాలేదు. కుంభకోణం లేదు.. లంబకోణం లేదు.. నీవు ఓ పిచ్చోడివి అని చెప్పాను. మీ ప్రభుత్వం వచ్చాక పెద్ద పెద్ద మాటలు నరికారు మంత్రులు, స్థానిక నాయకులు. చేనేత కార్మికులకు 365 రోజులు ఉపాధి కల్పిస్తామన్నారు. నాలుగైదు రోజులైతే 11 నెలలో అడుగు పెడుతుంది ఈ ప్రభుత్వం. మరి ఈ కాలంలో ఏం సాధించారు. మా ప్రభుత్వంలో మొత్తం తొమ్మిదిన్నరేండ్లలో సిరిసిల్లకు 3,312 కోట్ల ఆర్డర్లు ఇచ్చాం. మరి మీరు 365 రోజులు ఉపాధి కల్పించాలని అనుకున్నారు కదా.. ఆర్డర్లు డబుల్ ఇవ్వాలి కదా. నోటికొచ్చినట్టు మాట్లాడటం సరికాదు. తెలిసీ తెలియని కాంగ్రెస్ సన్నాసుల మాటలకు ఆగం కావొద్దు. మీ తరఫున కొట్లాడుతాం.. మీరు కూడా పోరాటానికి ముందుకు రావాలి. వారి ఎత్తుగడలకు ఆగం కాకండి అని కేటీఆర్ సూచించారు. రాష్ట్రంలో ఎక్కడ ఉప ఎన్నికలు జరిగినా బీఆర్ఎస్‌కు డిపాజిట్లు కూడా రావని కాంగ్రెస్ నేత, ఎమ్మెల్యే, మాజీ మంత్రి కడియం శ్రీహరి అన్న విషయం తెలిసిందే. ఈ కామెంట్స్‌పై కేటీఆర్ స్పందించారు. పార్టీ మారిన 10 నియోజకవర్గాల్లో ఉప ఎన్నికలు జరగడం ఖాయమని.. కడియంతో పాటు అందరూ సిద్ధంగా ఉండాలని పేర్కొన్నారు. ఉప ఎన్నికల్లో పార్టీ ఫిరాయించిన వారికి పరాభవం తప్పదని కేటీఆర్ విమర్శించారు.



# శృతి మించుతున్న డీజే చప్పుళ్లు

- రౌంట్ టేబుల్ సమావేశంలో కమిషనర్ సీవీ ఆనంద్

**హైదరాబాద్, ప్రజానావ:** డీజే శబ్దాలు శృతిమించిపోతున్నాయని.. వాటిని కట్టడి చేయాల్సి ఉందని హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్ అన్నారు. మతపరమైన ర్యాలీల్లో డీజేపీలు, టపాసుల వినియోగంపై ఆయన రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి, హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ పోలీస్ కమిషనర్లు హాజరయ్యారు. అలాగే రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్యే రాజాసింగ్‌తో పాటు ఎంఐఎం పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీవీ ఆనంద్ మాట్లాడుతూ.. డీజే శబ్దాలపై అనేక ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. డీజేలతో నివాసాల్లో వృద్ధులు ఇబ్బందులు పడుతున్నారని.. గుండె అదురుతుందని ఆందోళన చెందుతున్నారన్నారు. రానురాను డీజే శబ్దాలు శృతి మించిపోతున్నాయని.. గణేశ్ ఉత్సవాలతో పాటు మిలాద్ ఉన్ నబీ సమయంలోనూ డీజేలతో నృత్యాలు విపరీతమయ్యాయన్నారు. పబ్‌లలో నృత్యాలు చేసినట్లు ర్యాలీల్లో చేస్తున్నారనన్నారు. ఈ డీజేలను నియంత్రించకపోతే ఆరోగ్యాలు దెబ్బతినే ప్రమాదం ఉందన్నారు. ఆరోగ్య సమస్యలతో పాటు భద్రతకు సైతం ముప్పు ఉందన్నారు. డీజే శబ్దాలను కట్టడి చేయాలని అనేక సంఘాలు ఫిర్యాదు చేశాయన్నారు. ఈ క్రమంలోనే అందరి అభిప్రాయాలను తీసుకునేందుకు రౌండ్ టేబుల్ సమావేశాన్ని ఏర్పాటు చేశామని.. అందుకే అన్ని వర్గాలను సమావేశానికి ఆహ్వానించామన్నారు. అందరి అభిప్రాయాలను సేకరించి ప్రభుత్వానికి నివేదిక అందజేస్తామని.. సర్కారు చర్యలు తీసుకుంటుందని సీవీ ఆనంద్ పేర్కొన్నారు.

# హైడ్రా దూకుడుతో నేతల ఉలికిపాటు


- చర్యలు అడ్డుకుంటామంటూ హెచ్చరికలు
- బీజేపీ, బీఆర్ఎస్ తీరుపై సర్వత్రా విమర్శలు

**హైదరాబాద్, ప్రజానావ:** అక్రమార్కులను హడలెత్తిస్తోన్న హైడ్రా పేరు చెబితేనే రాజకీయ నాయకులకు కూడా కంటిమీద కునుకు పట్టడం లేదు. కెసిఆర్ హయాంలో అక్రమాలను కూల్చేస్తామని హడావిడి చేశారు. అప్పుడే ఎన్ కన్వెన్షన్, అయ్యప్ప సొసైటీలపై పడ్డారు. కానీ తరవాత ఏదో మతలబు జరిగింది. ఆగిపోయారు. ఇప్పుడు వారే అంటే కెసిఆర్ తనయుడు, అనుయాయులు మైడ్రా చర్యలను కూల్చేస్తున్నారు. ఒకడు చెరువులోనే బిల్డింగ్ కట్టుకుంటే వదిలేయాలా అన్నది ఇప్పుడీ పెద్దమనుషులు చెప్పాలి. హైడ్రా తరహా చర్యలు తీసుకోవాలని సర్వత్రా ఇప్పుడు డిమాండ్ వస్తోంది. కానీ కెటిఆర్, ఈటెల రాజేందర్, లాంటి వారు మాత్రం హైడ్రాపై విమర్శలు గుప్పిస్తున్నారు. అంటే అక్రమార్కులకు వత్తాసు పలుకుతున్నారని అనుకోవాలి. ఇప్పటికే తెలంగాణ కేబినెట్ హైడ్రాకు చట్టబద్ధతకల్పిస్తూ నిర్ణయం తీసుకుంది.. మిషన్ మూసీ ప్రక్షాళనలో హైడ్రాకు ఫుల్ పవర్స్ ఇచ్చారు సీఎం రేవంత్ రెడ్డి. తాజాగా హైడ్రాలో కొత్తగా 169 సిబ్బందిని కేటాయించారు. డిప్యుటేషన్‌పై వివిధ విభాగాల్లోని సిబ్బందిని హైడ్రాకు అటాచ్ చేస్తూ తెలంగాణ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. నలుగురు అదనపు కమిషనర్లు, ఐదుగురు డీసీపీలు, 16 మంది ఇన్‌స్పెక్టర్లు, 16 మంది ఎస్సైలు, 60 మంది కానిస్టేబుళ్లు, 12 మంది స్టేషన్ ÷ర్ ఆఫీసర్లు, 10 మంది అసిస్టెంట్ ఇంజినీర్లు సహా సైంటిస్ట్, తహసీల్దార్లు, సర్వేయర్ ,ఫారెస్ట్ ఆఫీసర్‌తో హైడ్రా మరింత బలోపేతమైంది. తిరుగులేని బాణంలా దూసుకెళ్తోన్న హైడ్రా.. ఇప్పుడు మరింత బలోపేతం అవుతుంది. చెరువులు, నాలాలపై కబ్జాల కబ్జాల తొలగింపుకు సీఎం రేవంత్ రెడ్డి హైడ్రాకు ఫుల్ పవర్స్ ఇచ్చారు. అయితే, ఆక్రమణలను తొలగించడం మంచిదే.. కానీ సంపన్నుల విషయంలో ఒకలా.. నిరుపేదల విషయంలా మరోలా వ్యవహరిస్తున్నారని విపక్షాలు కన్నెర్ర చేస్తున్నాయి. హైడ్రా పేరుతో హైడ్రామాలు చేస్తున్నారన్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. బాధితులకు బీఆర్ఎస్ అండగా వుంటుందన్నారు. అవసరమైతే బుల్డోజర్‌కు అడ్డుగా తాము నిలబడుతామన్నారు. బాధితులకు న్యాయం జరిగేలా లీగల్ ఎయిడ్ అందిస్తామన్నారు. హైడ్రా ముసుగులో పేదలపై దుర్మార్గపు చర్యలను ఆపాలని బీజేపీ నేత, ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. లేదంటే ఉద్యమం తరహాలో పెద్ద ఎత్తున ఆందోళనలు నిర్వహిస్తామన్నారు. కాంగ్రెస్ సర్కారు తప్పుల చిట్టాను ప్రజల్లోకి తీసుకెళ్తామని ఈటల చెప్పారు. హైడ్రా యాక్టివిటీ హద్దుల్లో ఉండాలంటున్నాయి విపక్షాలు .పర్యావరణ పరిరక్షణెళె లక్ష్యం.. చెరువులు, నాలాలపై కబ్జాలను తొలగించడమే మార్గం అంటూ హైడ్రాను ప్రభుత్వం మాత్రం మరింత బలోపేతం చేస్తున్నది. సవాళ్లు -ప్రతిసవాళ్లతో బుల్డోజర్ పాలిటిక్స్ మరింతగా హీటెక్కుతున్నాయి. అయితే మంచిని మంచిగా స్వాగతించాలి. అప్పుడే విపక్ష రాజకీయాలను ప్రజలు కూడా స్వాగతిస్తారు.



# సీనియర్ జర్నలిస్ట్ ఆదినారాయణ మృతి

## వాకింగ్ చేస్తూ. కిందపడి హఠాన్మరణం
## సంతాపం తెలిపిన ఇరు రాష్ట్రాల సీఎంలు, మంత్రులు



**హైదరాబాద్, ప్రజానావ:** సీనియర్ జర్నలిస్ట్, ఈటీవీ హైదరాబాద్ బ్యూరో చీఫ్ ఆదినారాయణ మృతి చెందారు. గురువారం ఉదయం అపార్టుమెంట్‌పై వాకింగ్ చేస్తుండగా ఆదినారాయణ ప్రమాదవశాత్తు జారిపడ్డారు. దీంతో కుటుంబసభ్యులు ఆయన్ను సమీపంలోని ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారు. ఆదినారాయణకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. సుమారు 25ఏళ్లుగా ఈటీవీలో ఆయన పని చేస్తున్నారు. ఆదినారాయణ మృతిపై తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు చంద్రబాబు, రేవంత్‌రెడ్డి, మాజీ సిఎం కెసిఆర్ తదితరులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ సంతాపం తెలి పారు. ఆదినారాయణ అకాల మరణం దిగ్భ్రాం తి కలిగించిందని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆదినారాయణ కుటుంబసభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆదినారాయణ మృతి పట్ల ఏపీ సీఎం చంద్రబాబు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన కష్టపడి పనిచేశారన్నారు. నిజాయతీ పరుడైన జర్నలిస్ట్‌గా సమాజంలో మార్పునకు ఎల్లప్పుడూ కృషి చేశారని కొని యాడారు. ఆదినారాయణ కుటుంబసభ్యులకు చంద్రబాబు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఎలక్ట్రానిక్ మీడియా రంగంలో అనుభవం కలిగిన జర్నలిస్ట్ ఆదినారాయణ మరణం బా ధాకరమని ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ అన్నారు. ఈటీవీ తెలంగాణ బ్యూరో చీఫ్ బా ధ్యతల్లో ఉన్న ఆయనకు వర్తమాన రాజకీయాలు, ప్రజా సమస్యలపై ఎంతో అవగాహన ఉందని కొనియాడారు. ఇటీవల అనారోగ్యానికి గురైన ఆయన కోలుకుంటారని ఆశించానని.. ఇంతలో మరణ వార్త వినాల్సి వచ్చిందన్నారు. ఆదినారాయణ ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆయన కుటుంబసభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆదినారాయణ హఠాన్మర ణం తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని ఏపీ మంత్రి నారా లోకేశ్ అన్నారు. బాధాతప్త హృద యంతో ఆయనకు నివాళులర్పిస్తున్నట్లు పేర్కొ న్నారు. రెండున్నర దశాబ్దాలుగా ఈటీవీలో పనిచేస్తూ ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేసిన నిబద్ధత గల జర్నలిస్ట్‌ను కోల్పోయాం. ఆదినారాయణ కుటుంబానికి నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను అని లోకేశ్ పేర్కొన్నారు. బిజెపి నేతలు కిషన్ రెడ్డి, లక్ష్మణ్ తదితరులు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. మీడియా అకాడమీ ఛైర్మన్ కె.శ్రీనివాసరెడ్డి తదితరులు సంతాపం ప్రకటించారు. ఆదినారా యణ మఅతి పట్ల మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు సంతాపం తెలిపారు. చిన్న వయస్సులోనే ఆయన మరణించడం చాలా బాధాకరమని కేటీఆర్ అన్నారు. ఆయన అకాల మరణం చాలా బాధించిందని హరీశ్ రావు తెలిపారు. ఆదినారాయణ మరణం పట్ల మంత్రులు సీతక్క, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి దిగ్భాంతి వ్యక్తం చేశారు. పొన్నం ప్రభాకర్, తుమ్మల సంతాపం ప్రకటించారు. టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ సైతం సంతాపం తెలిపారు.



# మహిళా లోకానికి స్ఫూర్తి చాకలి ఐలమ్మ

## బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**సిరిసిల్ల, ప్రజానావ:** తెలంగాణ ధీర వనిత, మహిళా లోకానికి స్ఫూర్తినిచ్చిన వీరనారి చాకలి ఐలమ్మ అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నివాళి అర్పించారు. ఐలమ్మ జయంతి సందర్భంగా సిరిసిల్ల పట్టణంలో చాకలి ఐలమ్మ విగ్రహానికి కేటీఆర్ పూలమాల వేసి నివాళులర్పించారు. వీరనారి చాకలి ఐలమ్మ అంటేనే పోరాట స్ఫూర్తికి ప్రతీక. తెలంగాణ రైతాంగ పోరాటంలో ఆమె చూపిన తెగువ మనందరికి ఆదర్శం అని కేటీఆర్ పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన పోరాటంలో నిత్య స్మరణీయురాలు ఐలమ్మ. బహుజనులు పెద్ద ఎత్తున ఉద్యమంలో భాగస్వామ్యం కావటానికి ఆమెనే స్ఫూర్తి. ఉద్యమ పోరాటాల్లో మహిళల పాత్ర అసమానమైనది అని చాటి చెప్పిన యోధురాలు ఐలమ్మ. ఇవ్వాళ ఆమె జయంతి సందర్భంగా ఆ మహనీయురాలిని స్మరించుకోవటం గొప్ప అవకాశం అని కేటీఆర్ పేర్కొన్నారు. ఐలమ్మ పోరాట స్ఫూర్తి, ఆకాంక్షలకు అనుగుణంగానే బీఆర్ఎస్ పాలన సాగింది. బడుగులు, బలహీన వర్గాల సంక్షేమం కోసం పనిచేస్తూ ఐలమ్మను ఘనంగా స్మరించుకున్నాం. చిట్యాల ఐలమ్మ పోరాట స్ఫూర్తిని భవిష్యత్ తరాలకు అందించాలనే ఉద్దేశంతో తెలంగాణ ఏర్పడ్డాక.. కేసీఆర్ ప్రత్యేక చొరవతో ఐలమ్మ జీవిత చరిత్రను పాఠశాల విద్యలో పాఠ్యాంశంగా చేర్చారు. పాలకుర్తి మార్కెట్ యార్డుకు ఐలమ్మ పేరు పెట్టారు. చిట్యాల ఐలమ్మ జయంతి, వర్ధంతి వేడుకలను అధికారికంగా నిర్వహించారు. ఐలమ్మ ఆకాంక్షలను నిత్యం ముందుకు తీసుకెళ్లటంలో బీఆర్ఎస్ ముందుంటుంది. పేదలు, బడుగుల కోసం పరితపించిన ఐలమ్మ ఆశయాలను కొనసాగించటమే ఆమెకు మనమిచ్చే ఘన నివాళి అని కేటీఆర్ తెలిపారు.

# బెంగళూరు యువతి హత్య కేసు

## నిందితుడు ముక్తిరంజన్ రాయ్ ఆత్మహత్య

**భువనేశ్వర్:** బెంగళూరులో మహాలక్ష్మి(29) అనే యువతిని కిరాతకంగా హత్య చేసి ముక్కలుగా నరికి, ఫ్రిజ్‌లో ఉంచిన ఘటనలో నిందితుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ హత్య తీవ్ర కలకలం రేపిన క్రమంలో నిం దితుడి కోసం పోలీస్ బృందాలు గాలింపు చేప ట్టాయి. ఈ కేసులో నిందితుడి కోసం ఒడిశా, పశ్చిమబెంగాల్, ఈశాన్య రాష్ట్రాల్లో పోలీసు బృందాలు గాలిస్తున్న వేళ అతను ఆత్మహత్యకు పాల్పడ్డట్లు తెలిసింది. బెంగళూరును షాక్‌కు గురిచేసిన ఈ వ్యవహారంలో నిందితుడు ముక్తి రంజన్ రాయ్ ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసు వర్గాలు తెలిపాయి. అతడు ఒడిశాలోని భద్రక్ జిల్లాలో ఓ చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు సమాచారం. బెంగళూరులోని బాధితురాలకి ఉన్న ముగ్గురు ముఖ్యమైన స్నేహి తుల్లో ఒకడైన ముక్తి రంజన్ రాయ్.. ఈ కేసు లో ప్రధాన అనుమానితుడిగా ఉన్నాడు. బెంగళూరులోని నెలమంగల సమీపంలో యువతిని ముక్కలుగా నరికి, రిఫ్రిజిరేటర్‌లో కుక్కి.. 'సడోమా సూకిస్టిక్' అనే నేరస్వభావంతో నిందితుడు రగిలిపోయినట్లు వైద్య నిపుణులు గుర్తించారు.

# అపవిత్రం చేసి తిరుమలకు వెళ్తారా?

- హిందువుల మనోభావాలు దెబ్బతీసి డ్రామాలా
- బీజేపీ ఎమ్మెల్యే రాజా సింగ్



**హైదరాబాద్, ప్రజానావ:** తిరుమల లడ్డూను అపవిత్రం చేసిన వారు తిరిగి అక్కడికి వెళ్లడం ఎందుకని జగన్ తిరు మల యాత్రపై బీజేపీ ఎమ్మెల్యే రాజా సింగ్ ఘాటు వ్యాఖ్య లు చేశారు. తిరుమల లడ్డూ పవిత్రత గురించి ఆయన మాట్లాడారు. వారు తిరుమల వెళితే తీవ్ర పరిణామాలు ఎదుర్కొవాల్సి వస్తోందని హెచ్చరించారు. లడ్డూను అపవిత్రం చేసిన వారు తిరుమల వెళితే హిందువులు అంతా ఏకమై వారిని హతమారుస్తారని ఘాటు వ్యాఖ్యలు చేశారు. హిందువుల మనోభావాలు అందరూ గౌరవించాల్సిందే నని రాజా సింగ్ స్పష్టం చేశారు. ఇందులో సందేహానికి తావులేదని తేల్చి చెప్పారు. హిందువులను చులకన చేయడం, తప్పుగా మాట్లాడతారో వారికి ఇబ్బందులు తప్పవని తనదైన శైలిలో రాజా సింగ్ హెచ్చరించారు. తిరుమల లడ్డూ ప్రసాదం కల్తీపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం టాస్క్ ఫోర్స్ ఏర్పాటు చేయాలని రాజా సింగ్ సూచించారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లడ్డూ నాణ్యతపై ఏపీ సర్కార్ సిట్ ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. సిట్‌తోపాటు టాస్క్ ఫోర్స్ కమిటీ ఏర్పాటు చేయాలని రాజా సింగ్ కోరారు. తెలుగు రాష్టాల్లో ఉన్న ఆలయాలను పరిరక్షించాలని అభిప్రాయ పడ్డారు. అదేవిధంగా దేవదాయ ధర్మదాయ శాఖకు చెందిన భూములను కాపాడాల్సిన అవసరం ఉందన్నారు. లేదంటే అవి యథేచ్ఛగా ఆక్రమణకు గురి అవుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. హిందు సంస్కృతి, సంప్రదాయాల ను గౌరవించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందని గుర్తుచేశారు. తెలుగు రాష్ట్రాల్లో అన్య మతస్తుల ప్రచారం గురించి రాజా సింగ్ గుర్తుచేశారు. ప్రముఖ పుణ్యక్షేత్రాల వద్ద అన్య మతస్తుల సంచారం ఆందోళన కలిగిస్తోందని వివరించారు. తిరుపతితోపాటు శ్రీశైలంలో అన్య మతస్తుల గురించి వార్తలు వస్తున్నాయని పేర్కొన్నారు. మత మార్పిడి చేసే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. మిగతా చోట్ల అన్య మతస్తుల గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదన్నారు. డబ్బులు, ఇతరత్రా ఇస్తామని చెప్పి హిందువుల మత మార్పిడి చేస్తున్నారని వివరించారు. మతం మారిన వారిలో బలహీన వర్గాలే ఎక్కువ మంది ఉన్నారని గుర్తుచేశారు.



# మహారాష్ట్రలో భారీ వర్షాలు

## ప్రధాని పుణె పర్యటన రద్దు

**ముంబై:** మహారాష్ట్రలో వర్షాలు దంచికొ డుతున్నాయి. దీంతో ముంబయి సహా పలు జిల్లాల్లో జనజీవనం అస్తవ్యస్తమైన వేళ శుక్రవారం వరకు వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ అంచనా వేసింది. ఈ క్రమంలో ప్రధాని మోడి పుణె పర్యటన రద్దయింది. ఇప్పటికే మహారాష్ట్రలోని కొన్ని జిల్లాలకు వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ ప్రకటించింది. విద్యాసంస్థలకు ప్రభుత్వం సెలవు ఇచ్చింది. ప్రధాని ఈ రోజు పూణెకు చేరుకుని అక్కడ రూ. 22 వేల 900 కోట్ల విలువైన పథకాలను ప్రారంభించి, శంకుస్థాపన చేయాల్సింది. దీంతో పాటు పుణె వాసులకు మెట్రో సర్వీస్ ప్రారంభం కావల్సి ఉంది. స్వర్‌గేట్‌ను డిస్ట్రిక్ట్ కోర్ట్‌ను కలిపే భూగర్భ మెట్రోను ప్రధాని మోడి ప్రారంభించాలని ప్లాన్ చేసుకున్నారు. దీంతో పాటు భిడే వాడాలో మరిన్ని ముఖ్యమైన ప్రాజెక్టులను కూడా ప్రారంభించాల్సి ఉంది. పీఎం మోడీ పర్యటన కోసం, పూణెళి పరిపాలన నుండి ఒక ఉత్తర్వు జారీ చేయబడింది. నది వైపు ప్రాంతం, భిడే వంతెనను పార్కింగ్ కోసం సేకరించారు. దీని కారణంగా ప్రజలు భారీ ట్రాఫిక్‌ను ఎదుర్కోవలసి ఉంటుంది. అయితే భారీ వర్షాల నేపథ్యంలో పుణెలో ప్రధానమంత్రి మోడీ పర్యటన రద్దయింది. ఇకపోతే ముంబైలో భారీ వర్షం బీభత్సం సృష్టించింది. కుండపోత వానతో ముంబై అతలాకుతలం అయ్యింది. బుధవారం నుంచి గురువారం తెల్లవారుజాము వరకు వర్షం దంచికొట్టింది. ఈ నేపథ్యంలో గురువారం పుణె, ముంబైలోని విద్యాసంస్థలకు సెలవు ప్రభుత్వం సెలవు ప్రకటించింది. ముంబైలోని పలు లోతట్టు ప్రాంతాలను భారీ వరదలు ముంచెత్తాయి. రోడ్లు రహదారులు జలయమయ్యాయి. దీంతో భారీ ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. భారీ వర్షాల కారణంగా ముంబ్రా బైపాస్ వద్ద రాత్రి 11.30 గంటల సమయంలో కొండచరియలు విరిగిపడటంతో పెద్ద ఎత్తున ట్రాఫిక్‌కు జామ్ అయ్యింది. అగ్నిమాపక అధికారి స్వప్నిల్ సర్నోబత్ మాట్లాడుతూ.. దాదాపు 3 గంటలపాటు ట్రాఫిక్ జామ్ ఏర్పడిందని, ఈ సమయంలో ట్రాఫిక్ విభాగం కూడా ట్రాఫిక్‌ను ఒకవైపు నుంచి నియంత్రించిందని, అదృష్టవశాత్తూ ఎలాంటి ప్రాణనష్టం సంభవించలేదని.. రోడ్డుపై రాళ్లను జేసీబీతో తొలగించి ట్రాఫిక్‌ను క్లియర్ చేసినట్లు తెలిపారు. ఇక, పలు చోట్ల రైలు పట్టాలు నీటిలో మునిగిపోయాయి. దీంతో సబర్బన్ రైళ్లను నిలిపివేశారు. అలాగే, పలు విమానాల దారి మళ్లించారు. రానున్న మరికొన్ని గంటల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ముంబైకి ఐఎండీ రెడ్ అలర్ట్ ప్రకటించింది.

# తిరుమల వ్యవహారంతో తెలంగాణ అప్రమత్తం

## ఆలయాల్లో ప్రసాదాల నాణ్యతపై ఆరా
## విజయ నెయ్యినే వాడాలని ఆదేశాలు

**హైదరాబాద్, ప్రజానావ:** తిరుమల లడ్డూ ప్రసాదంలో జంతువుల కొవ్వు కలిసిందంటూ నిర్ధారణ అయిన నేపథ్యంలో తెలంగాణ దేవాదాయ శాఖఅప్రమత్తం అయ్యింది. రాష్ట్రంలో పలు ప్రధాన ఆలయాల్లోని లడ్డూల నాణ్యతపై టెస్టులు చేపట్టింది. ప్రముఖ దేవాలయాల్లోని నెయ్యి, ఇతర పదార్థాల శాంపిల్స్‌ను అధికారులు ల్యాబ్‌కు పంపించారు. అన్ని టెంపుల్స్‌లో తనిఖీలు చేపట్టాలని ఆదేశాలు జారీ అయ్యాయి. ఇకపై ప్రసాదాల తయారీకి విజయ నెయ్యి, పాలనే వాడాలని దేవాదాయశాఖ ఆదేశాలు జారీచేసింది. భక్తుల మనోభావాలకు సంబంధించిన అంశం కావడంతో ఎలాంటి అపోహలకు తావివ్వకుండా ముందస్తు చర్యలు చేపట్టింది. అన్ని ఆలయాల్లో తనిఖీలు చేపట్టాలని దేవాదాయ శాఖ ఆదేశాలు జారీ చేసింది. లడ్డూలు, పులిహోర తయారీలో వాడే నెయ్యి, యాలకుల పొడి, జీడిపప్పు, చక్కెర పాకం, బూందీ ఇతర ముడి సరుకుల నాణ్యతను పరిశీలించాలని అధికారులను తెలంగాణ దేవాదాయ శాఖ ఆదేశించింది. దేవాదాయ శాఖ ఆదేశాలతో ఈవోలు ఆలయాల్లో తనిఖీలు చేపట్టారు. నెయ్యి శాంపిల్స్‌ను హైదరాబాద్‌లోని ల్యాబ్‌కు పరీక్షల నిమిత్తం పంపించారు. కొన్ని ఆలయాల్లో ప్రత్యేకంగా టెస్టింగ్ కమిటీల ఆధ్వర్యంలో లడ్డూలను తయారుచేస్తున్నారు. వేములవాడ, యాదగిరిగుట్ట, భద్రాచలం, బాసర, హనుమకొండ భద్రకాళి ప్రసాదాల్లో వినియోగిస్తున్న నెయ్యి, ఇతర పదార్థాలను పరీక్షల కోసం ఇప్పటికే హైదరాబాద్‌లోని ల్యాబ్‌కు అధికారులు పంపించారు. యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ప్రసాదంలో వినియోగిస్తున్న నెయ్యి శాంపిల్స్‌ను సేకరించి హైదరాబాద్‌లోని చర్లపల్లిలోని ల్యాబ్‌కు తరలించారు. యాదాద్రిలో పదేళ్లుగా మదర్ డెయిరీ నెయ్యి వాడకం జరుగుతోంది. నెలకు సుమారు 20 వేల నుంచి 25 వేల కిలోల నెయ్యిని వినియోగించడం జరుగుతుంది. భద్రాచలంలో ప్రసాదాల తయారీకి ప్రత్యేక కమిటీని నియమించారు. కాగా.. తిరుమల లడ్డు ప్రసాదంలో కల్తీ నెయ్యి ఘటన ఎంతటి దుమారం రేపిందో అందరికీ తెలిసిందే. ప్రపంచవ్యాప్తంగా ఉన్న శ్రీవారి భక్తులు ఈ విషయాన్ని తీవ్రంగా ఖండించారు. వైసీపీ హయాంలో శ్రీవారి లడ్డూల తయారీలో జంతువుల కొవ్వు కలిసినట్లు నిర్ధారణ అయ్యింది.



## బదిలీపై వెళ్లిన అధ్యాపకుడికి సన్మానం

**కాగజ్ నగర్ టౌన్, ప్రజానావ:** కాగజ్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అర్థశాస్త్ర అధ్యాపకుడిగా విధులు నిర్వర్తించి ఇటీవల వరంగల్ జిల్లా వర్ధన్నపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు బదిలీపై వెళ్తున్న అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ చిలుసాని రాజును కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కే శ్రీదేవి మాట్లాడుతూ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆర్థిక శాస్త్ర అధ్యాపకుడిగా పనిచేసిన డాక్టర్ చిలుసాని రాజు సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ డి. లక్ష్మీనరసింహం అకాడమిక్ కోఆర్డినేటర్ డి జనార్ధన్ అధ్యాపకులు వెంకటేశ్వర్లు రాజేశ్వర్, శారద, దేవేందర్ పాల్గొన్నారు.



## బతుకమ్మ, దేవీ నవరాత్రి ఉత్సవాలు వైభవంగా నిర్వహించాలి

- ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్
- రాజన్న ఆలయంలో సమీక్ష సమావేశం

**వేములవాడ, ప్రజానావ:** రానున్న బతుకమ్మ, దేవీ నవరాత్రి ఉత్సవాలు వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో వైభవంగా నిర్వహించాలని, అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ఆదేశించారు. బతుకమ్మ, దేవీ నవరాత్రుల సందర్భంగా వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో చేయాల్సిన ఏర్పాట్లపై ఆలయంలోని గెస్ట్ హౌస్ లో గురువారం సమీక్ష సమావేశం ఏర్పాటు చేయగా, ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, కలెక్టర్ సందీప్ కుమార్ ఝా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆలయ అధికారులు పక్కా ప్రణాళికతో వేడుకలను ఘనంగా నిర్వహించాలని సూచించారు. ముందస్తుగా ప్రణాళిక సిద్ధం చేయాలని ఈవో వినోద్ రెడ్డిని ఆదేశించారు. ఇక్కడ ఈ ఈ రాజేష్ ,డి ఈ రఘునందన్, స్థానాచారి అప్పల బీమా శంకర్, ఆలయ పండితులు, నెమలికొండ ఉమేష్, చంద్రగిరి శరత్ తదితరులు పాల్గొన్నారు.

## రేపు రుద్రంగిలో మెగా జాబ్ మేళా

**ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్**

**సిరిసిల్ల, ప్రజానావ:** జిల్లాలోని నిరుద్యోగ యువతీ యువకులకు ప్రముఖ ప్రైవేట్‌హా కంపెనీల్లో ఉద్యోగాలు కల్పించేందుకు ఈ నెల 28వ తేదీన శనివారం డిస్ట్రిక్ట్ అడ్మినిస్ట్రేషన్ రాజన్న సిరిసిల్ల ఆద్వర్యంలోహౌరుద్రంగిలోని రెడ్డీస్ ఫంక్షన్ హాల్ లో మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. పదోతరగతి, ఇంటర్, డిగ్రీ పూర్తి చేసిన అభ్యర్థులకు నెలకుహౌరూ. 12వేల నుంచి రూ. 40వేల వరకు వేతనంహౌొంటుందని తెలిపారు. మెగా జాబ్ మేళాలో హైదరాబాద్, కరీంనగర్, సిరిసిల్ల, వేములవాడకుహౌ చెందిన ప్రముఖ కంపెనీలు పాల్గొంటున్నాయని వివరించారు. జిల్లాలోని అర్హత, ఆసక్తి కలిగిన నిరుద్యోగ యువతీ యువకులు తమ బయోడేటా, విద్యార్హత సర్టిఫికెట్స్ జిరాక్స్ కాపీలతో రుద్రంగిలోని రెడ్డీస్ ఫంక్షన్ హాల్ లో మెగా జాబ్ మేళా శనివారం ఉదయం 10.00 గంటలకు తరలిరావాలని పిలుపు నిచ్చారు. మరిన్ని వివరాలకుహౌ99633 57250, 98853 46768. నెంబర్లలో సంప్రదించాలని సూచించారు.



## ఫోక్ ప్రొడ్యూసర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా మహమ్మద్ రఫీక్

**వేములవాడ, ప్రజానావ:** వేములవాడ ఫోక్ ప్రొడ్యూసర్స్ అసోసియేషన్ కార్యవర్గాన్ని గురువారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మహమ్మద్ రఫీ, ఉపాధ్యక్షులుగా తాండ్రయాల తిరుపతి, దుర్గం మహేష్, ప్రధాన కార్యదర్శిగా రంగు అనిల్ గౌడ్‌ను నియమించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు రఫీక్ మాట్లాడుతూ తన ఎన్నికకు సహకరించిన ప్రతీ ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. అసోసియేషన్ అభివృద్ధికి, నిర్మాతల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానన్నారు. నూతన ఫోక్ ప్రొడ్యూసర్స్ అసోసియేషన్ కార్యవర్గానికి పలువురు శుభాకాంక్షలు తెలిపారు.



## రేషన్ డీలర్ల ఎంపికపై నిరసన

**సిరిసిల్ల, ప్రజానావ:** ఇటీవల జరిగిన రేషన్ డీలర్ల ఎంపికలో అవకతవకలు జరిగాయంటూ, వాటిని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ అభ్యర్థులు గురువారం నిరసన తెలిపారు. సిరిసిల్ల పట్టణంలోని కొత్త బస్టాండ్ వద్ద వాటర్ ట్యాంక్ పైకి ఎక్కి నిరసన వ్యక్తం చేశారు. ఈ ఎంపికలో చాలా అవకతవకలు జరిగాయని, వీటి తాము నష్టపోయామని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఏఎస్పీ చంద్రయ్య, తహసీల్దార్ షఫుల్ షరీఫ్ లు వచ్చి నచ్చజెప్పడంతో ఆందోళన విరమించారు. ఈ సంధర్భంగా తహసీల్దార్ కు వినతి పత్రం అందజేశారు.

## సిరిసిల్ల ఆర్డీవో కార్యాలయంలో విజిలెన్స్ తనిఖీలు

**సిరిసిల్ల, ప్రజానావ:** సిరిసిల్ల ఆర్డీవో కార్యాలయంలో సివిల్ సప్లయ్ విజిలెన్స్ ఎన్ ఫోర్సమెంట్ ఎస్పీ శశిధర్ రాజు ఆధ్వర్యంలో గురువారం తనిఖీలు నిర్వహించారు. రేషన్ డీలర్ల ఎంపికలో అవకతవకలు జరిగాయంటూ వచ్చిన ఆరోపణల నేపథ్యంలో విజిలెన్స్ తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా పలు రికార్డులను పరిశీలించారు.

## ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి పేదలకు న్యాయం చేయండి

- జీహెచ్‌ఎంసీ కమిషనర్‌కు జూబ్లీహిల్స్ కార్పొరేటర్ వినతి

**ఖైరతాబాద్, ప్రజానావ:** రోడ్ నెంబర్ 46 అంబేద్కర్ నగర్ డబుల్ బెడ్ రూమ్ సమస్యపై గురువారం జూబ్లీహిల్స్ డివిజన్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేశ్ జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలిని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ 2009లో ఇందిరమ్మ ఇళ్లు మంజూరైనా అవి కోర్టు కేసులతో నిలిచిపోయాయని, ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వంలో ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి పేద ప్రజలకు న్యాయం జరిగే విధంగా చూడాలని కోరారు. గత 30 ఏళ్లుగా ఇక్కడి ప్రజలు నీళ్లు, కరెంటుతో పాటు మౌలిక సదుపాయాలు లేకుండా నివసిస్తున్నారని, వీరందరికీ న్యాయం చేసేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. గురు బ్రహ్మనగర్లో ఇండ్ల నిర్మాణం చేపట్టి జూబ్లీహిల్స్, బంజారాహిల్స్ పేద ప్రజలకు న్యాయం చేకురేలా చూడాలన్నారు. ఈ విషయమై కమిషనర్ ఆమ్రపాలి సానుకూలంగా స్పందించారు. అక్కడ వెలిసిన అక్రమ కట్టడాలను తొలిగించి పేదలకు న్యాయం చేస్తామన్నారు.





**ఖైరతాబాద్ నియోజకవర్గం జూబ్లీహిల్స్ డివిజన్ గౌతమ్ నగర్ చౌరస్తాలో గురువారం నిర్వహించిన బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమానికి బీజేపీ జాతీయ కార్యదర్శి, దక్షిణ భారతదేశం బీజేపీ సభ్యత్వం నమోదు ఇన్చార్జి అరవింద్ మీనాన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింతల రామచంద్రారెడ్డి, హైదరాబాద్ సెంట్రల్ జిల్లా బీజేపీ అధ్యక్షులు డా.గౌతమ్ రావు, జిల్లా ఇన్చార్జి వీరెల్లి చంద్రశేఖర్, నేతలు భోజిరెడ్డి, బంగారం చంద్రశేఖర్, గడ్డం వెంకటస్వామి, కొత్త నీరజ, స్థానిక డివిజన్ బీజేపీ అధ్యక్షుడు ముద్దంగుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.**

- ఖైరతాబాద్, ప్రజానావ

## ఘనంగా చాకలి ఐలమ్మ జయంతి వేడుకలు

**ఖైరతాబాద్, ప్రజానావ:** జూబ్లీహిల్స్ డివిజన్ ఫిలింనగర్లో చాకలి ఐలమ్మ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా 18 బస్తీల సంక్షేమ సంఘం అధ్యక్షుడు మామిడి నర్సింగ్రావు, జూబ్లీహిల్స్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కాటూరి రమేశ్ పాల్గొని మాట్లాడారు. భూమి కోసం.. భుక్తి కోసం.. వెటీ చాకిరి విముక్తి కోసం, అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం నిరంతరం పోరాటం చేసిన పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ అని ఆమె సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు ఆకుల రాజు, ఖైరతాబాద్ డీసీసీ జనరల్ సెక్రెటరీ శ్యామ్ నాయుడు, బోదాస్ నాగార్జున, గుంజ ఆంజనేయులు, దయ్యాల దాసు, గద్దల ప్రభాకర్, రవి, శివకుమార్, మంగమ్మ, తదితరులు పాల్గొన్నారు.




## ఐలమ్మ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకోవాలి

**సిరిసిల్ల, ప్రజానావ:** వీరనారి చాకలి ఐలమ్మ 129 వ జయంతి ఉత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా గురువారం బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వేడుకలుహౌజిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో చేపట్టగా, జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ హాజరై ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి అనంతరం ఐలమ్మ చిత్రపటానికి పూల మాలలు వేసి, ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వీరనారి చాకలి ఐలమ్మ గొప్ప పోరాట యోధురాలు అని ఆమె ఆశయాలను ప్రతి ఒక్కరు స్ఫూర్తిగా తీసుకోవాలని అన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ ఉద్యమంలో వీరనారి చాకలి ఐలమ్మ ముఖ్య భూమిక పోషించారని, తెలంగాణ పౌరుషాన్ని, పోరాటాన్ని, త్యాగాన్ని భావి తరాలకు అందించి ఉద్యమ స్ఫూర్తిని చూపిన గొప్ప పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి రాజ మనోహర్, ఆయా శాఖల అధికారులు, సిబ్బంది, రజక సంఘం ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



**బెజ్జూర్, ప్రజానావ:** బెజ్జూర్ మండల కేంద్రంలో చాకలి ఐలమ్మ జయంతిని బస్టాండ్ ప్రాంతంలో రజక సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా ఐలమ్మ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రజక సంఘం నాయకులు పొన్న చిరంజీవి , వెంకటేష్ , జనగామ శ్రీనివాస్ , పొన్న రాకేష్ , రవి, కడిముంత రాకేష్ , పొన్న కార్తిక్, మైనారిటీ నాయకులు తెలంగాణ జావిద్, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కొండ్ర బ్రహ్మయ్య, పద్మశాలి సంఘం మండల అధ్యక్షులు సామల తిరుపతి, శ్రీరామ శేఖర్ , ఆయిళ్ల శంకర్ తదితరులు పాల్గొన్నారు.






## మహిళలు, విద్యార్థినులను వేధిస్తే చర్యలు

**సిరిసిల్ల అదనపు ఎస్పీ చంద్రయ్య**

**22 మంది ఆకతాయిలకు కౌన్సెలింగ్**

**సిరిసిల్ల, ప్రజానావ:** మహిళలు, విద్యార్థినులను వేధిస్తే కఠిన చర్యలు తప్పవని సిరిసిల్ల అదనపు ఎస్పీ చంద్రయ్య హెచ్చరించారు. ఎస్పీ అఖిల్ మహాన్ ఆదేశాల మేరకు జిల్లా పోలీస్ కార్యాలయంలో గురువారం జిల్లాలో మూడు నెలల వ్యవధిలో వివిధ సందర్భాల్లో మహిళలు, బాలికలు, విద్యార్థినులను వేధించిన 22 మంది ఆకతాయిలకు అదనపు ఎస్పీ కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సంవత్సరంలో ఇప్పటి వరకు మహిళలు, బాలికలు, విద్యార్థినులకు వేధిస్తున్న పోకిరీలపై 37 కేసులు, 40 పెట్టి కేసులు నమోదు చేసి వారి తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ మాట్లాడుతూ.. మహిళలు, చిన్న పిల్లల రక్షణ విషయంలో జిల్లా పోలీసు శాఖ పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నదని స్పష్టం చేశారు. మహిళల భద్రత కోసం షీటీమ్స్ ఉందన్నారు. మహిళలు, విద్యార్థినులను వేధించినా.. వెంబడించినా.. సామాజిక మధ్యమాల ద్వారా ఇబ్బందులు పెట్టినా.. కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మహిళలు యువతులు ఎలాంటి సమస్య ఉన్న నిర్భయంగా జిల్లా షీ టీమ్ ని సంప్రదించాలని, నేరుగా సంప్రదించలేని వారు షీ టీమ్ నంబర్ 87126 56425, డయల్ 100 కు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో షీటీమ్ ఏఎస్సై ప్రమీల, మహిళా కానిస్టేబుల్ ప్రియాంక ఉన్నారు.





## మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌కు ఘన సన్మానం

**ఆదిలాబాద్, ప్రజానావ:** తెలంగాణ మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌గా నియమితులై తొలిసారిగా ఆదిలాబాద్ జిల్లాకు వచ్చిన నేరెళ్ల శారదను గురువారం జిల్లా కేంద్రంలోని పెన్ గంగా అతిథి గృహంలో తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి ఘనంగా సన్మానించి, అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా మహిళల హక్కులు, భద్రత, సంక్షేమం వంటి పలు ప్రధాన అంశాలపై చర్చించారు. భవిష్యత్తులో మహిళా సమస్యల పరిష్కారానికి మరింత సహకారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో దేవదాస్ చారి, నవీన్ రెడ్డి, సుధాకర్ గౌడ్, మావల మండల అధ్యక్షుడు చంద్రశేఖర్, ఇమామ్, యువజన కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు నాగరాజు వేముల,రంజిత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మహిళల అభ్యున్నతికి కృషి




- మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నేరెళ్ల శారద

**ఆదిలాబాద్, ప్రజానావ:** మహిళల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి చేస్తున్నదని మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నేరెళ్ల శారద అన్నారు. గురువారం జిల్లా పర్యటనలో భాగంగా అదనపు కలెక్టర్ శ్యామలా దేవి, మహిళా కమిషన్ మెంబర్ ఈశ్వరీ బాయి,అడిషనల్ ఎస్పీ సురేందర్ తో కలసి కలెక్టరేట్ సమావేశం మందిరంలో మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులు, జిల్లా అధికారులతో ఏర్పాటు చేసిన పోషణ అభియాన్ పోషణ మాసం సమావేశంలో పాల్గొని మాట్లాడారు. మహిళల స్థితిగతులను మెరుగుపరచడానికి, మహిళలకు జరిగే అన్యాయాలపై విచారణ చేయడానికి, మహిళలకు సంబంధించిన విషయాల కోసం మహిళా కమిషన్ ఏర్పాటు చేసినట్టు వివరించారు. చట్టాలపై ప్రతీ ఒక్కరికీ అవగాహన కలిగి ఉండాలని, ఎస్సీ, ఎస్టీ యాక్ట్ పై అవగాహన కల్పిస్తామన్నారు. ముందుగా చట్టాల అమలుపై అధికారులకు అవగాహన ఉంటేనే ఇతరులకు చెప్పగలుగుతామని అన్నారు. ముఖ్యంగా ఇప్పుడున్న మహిళా కమిషన్ ఒక విజన్, ఎజెండాతో ముందుకు వెళుతుందని, ఆదిలాబాద్ జిల్లా మారుమూల ప్రాంతాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటామన్నారు. రాష్ట్ర, కేంద్రాల ద్వారా చేపడుతున్న కార్యక్రమాలు, అభివృద్ధి పథకాలు అందరికీ చేరువయ్యేలా ఆయా శాఖల సమన్వయంతో పనిచేయాలని, అవసరమైతే పోలీస్, లీగల్ సపోర్ట్ తీసుకోవాలని అన్నారు. గతంలో జరిగిన సంఘటనలు పునరావృతం కాకుండా గ్రామాల్లో అవగాహన కల్పించాలన్నారు. ఈ సందర్భంగా నాలుగు జిల్లాల డీడబ్ల్యూవోలు, సీడీపీఓలు, వైద్యం, మెప్మా తదితర శాఖల వారీగా జిల్లాలో చేపడుతున్న అభివృద్ధి పనుల తీరును కమిషన్ చైర్‌పర్సన్‌కు తెలియజేశారు. ఈ సమావేశంలో జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## జిల్లా జైలు సందర్శన

రెండు రోజుల పర్యటనలో భాగంగా ఆదిలాబాద్ జిల్లాకు వచ్చిన తెలంగాణ మహిళా కమిషన్ చైర్ పర్సన్ నేరెళ్ల శారద గురువారం కలెక్టర్ రాజర్షి షా, అదనపు కలెక్టర్ శ్యామలా దేవి, మహిళా కమిషన్ సభ్యురాలు ఈశ్వరి భాయితో కలిసి మొదటి రోజు స్థానిక జైలును సందర్శించారు. మహిళా ఖైదీలతో మాట్లాడి వారి సమస్యలు, ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జైలు సూపరింటెండెంట్ ఖైదీలకు అందించే మెనూ, తీసుకుంటున్న జాగ్రత్తలు, జైలులో పాటిస్తున్న పరిశుభ్రత, భద్రత అంశాలపై వివరించారు. అనంతరం జైలులో నిర్వహించిన మెడికల్ క్యాంప్ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం మహిళా ఖైదీలకు పండ్లను పంపిణీ చేశారు. త్వరలోనే సైకాలజిస్టులతో కౌన్సెలింగ్ తరగతులు నిర్వహించేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. కలెక్టర్ రాజర్షి షా మాట్లాడుతూ 7వ రాష్ట్రీయ పోషణ మాసం సందర్భంగా హెల్త్ క్యాంపుల్లో పరీక్షలు నిర్వహించి, అవగాహన కల్పించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో జైలు సూపరింటెండెంట్, మహిళా శిశు సంక్షేమ అధికారులు పాల్గొన్నారు.





## సమస్యల పరిష్కారానికి కృషి

### ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీ దండే విఠల్

**కాగజ్ నగర్ టౌన్, ప్రజానావ:** సిర్పూర్(టీ) మండలం లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీ దండే విఠల్ పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలో పార్టీ ముఖ్య నేతలతో సమావేశమయ్యారు. మండలంలో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వాటి పరిష్కారం తీసుకోవాల్సిన చర్యలపై పై చర్చించారు. సమస్యల పరిష్కారానికి ప్రతి ఒకరూ సహకరించాలని కోరారు. మండలం నుంచి మహారాష్ట్రలోని రాజుర వరకు బస్ సౌకర్యం కల్పించాలని నాయకులు కోరగా, ఎమ్మెల్సీ వెంటనే ఆర్టీసీ డిపో మేనేజర్ విశ్వనాథ్‌కు ఫోన్ చేసి బస్ సౌకర్యం కల్పించాలని కోరారు. మండల కేంద్రం సహా గ్రామాల్లోని రోడ్ల గురించి అడిగి తెలుసుకున్నారు. త్వరలోనే అన్నింటినీ పరిశీలించి నూతన రోడ్ల మంజూరుకు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు మాజీ జడ్పీ చైర్మన్ సీడం గణపతి, ఎల్ములే కిషోర్, సోహెల్, నర్గ వార్ రాజు, అఖీల్, అఫ్సర్, తరుణ్ కిర్మారే, లోఖండే వసంత్, జల్ల అశోక్, దుర్గం తులసీరామ్, సలీం తదితరులు ఉన్నారు.

## విజయదశమి ఉత్సవాల ఏర్పాట్లు

**ఆసిఫాబాద్ టౌన్, ప్రజానావ:** జిల్లా కేంద్రంలోని కేస్లాపూర్ వీరాంజనేయ స్వామి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అక్టోబర్ 12న విజయదశమి వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు కమిటీ ప్రకటించింది. ఉత్సవాల ఏర్పాటల్లో భాగంగా గురువారం ఆలయంలో ఉత్సవాలకు సంబంధించిన ప్రచార సామాగ్రిని విడుదల చేశారు. విజయదశమి రోజున ఆలయ ప్రాంగణంలో ఎప్పటిలాగే వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు కమిటీ ప్రముఖులు తెలిపారు. శ్రీరాముని ఎంపిక, శమీ వృక్ష పూజ ,సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆలయ కమిటీ అధ్యక్షులు ధర్మపురి వెంకటేశ్వర్లు కార్యదర్శి గుండ వెంకన్న, కోశాధికారి పిన్న వివేక్, కమిటీ ప్రముఖులు వనం మధుకర్, కృపాల్ తదితరులు పాల్గొన్నారు.




## పేద విద్యార్థుల యూత్ వెల్ఫేర్ అండ

**కాగజ్ నగర్ టౌన్, ప్రజానావ:** తండ్రిని కోల్పోయిన పేదింటి ఇద్దరు విద్యార్థుల చదువు బాధ్యతలను శివరామ సాయి యూత్ వెల్ఫేర్ సభ్యులు తీసుకున్నారు. కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లా చింతలమానెపల్లి మండలం డబ్బా ఎక్స్ రోడ్ ధరంపల్లి గ్రామానికి చెందిన కమల భర్త లొంబడి పునాజీ ఎనిమిదేండ్ల క్రితం మృతి చెందాడు. కూలీ పనులు చేసుకుంటూ ఇద్దరు పిల్లలను చదివిస్తున్నది. కూలీ పనులతో పూటగడవడమే గగనంగా మారగా, పిల్లల చదువులు ప్రశ్నార్థకంగా మారాయి. విషయం తెలుసుకున్న శివరామసాయి యూత్ వెల్ఫేర్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు గుర్లే శ్రీనివాస్, యూత్ సభ్యులు ఆ పిల్లలను చదివించేందుకు ముందుకు వచ్చారు. మొగడ్ ధగడ్ ప్రభుత్వ ఆశ్రమోన్నత పాఠశాలలో చేర్పించారు.

## జ్యూస్ సెంటర్ వద్ద గొడవ

- కత్తులతో రెచ్చిపోయిన యువకులు, 8మందికి గాయాలు

**రాజేంద్రనగర్, ప్రజానావ:** రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ లో కొందరు యువకులు కత్తులతో రెచ్చిపోయారు. బుధవారం అర్ధరాత్రి పిల్లర్ నంబర్ 209 వద్ద ఉన్న రాయల్ జ్యూస్ సెంటర్లో కస్టమర్ల మధ్య గొడవ జరిగిది. ఆ గొడవను అడ్డుకోబోయిన షాపు యజమానిపై 15 మంది యువకులు కత్తులతో దాడి చేశారు. ఈ దాడిలో మొత్తం 8 మందికి గాయాలు అయ్యాయి. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని సదరు యువకులను అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## జాతీయ లోక్ అదాలత్‌ను వినియోగించుకోవాలి

**వేములవాడ, ప్రజానావ:** జాతీయ న్యాయ సేవాధికార సంస్థ న్యూఢిల్లీ ఆదేశాల మేరకు ఈ నెల 28న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్ను కక్షిదారులు వినియోగించుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ ఎన్. ప్రేమలత సూచించారు. గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ కక్షిదారులు తమ రాజీ చేయదగిన క్రిమినల్, సివిల్, చెక్ బౌన్స్, గృహహింస, ప్రీ-లిటి గేకేషన్ కేసుల్లో రాజీకుదుర్చుకొని కేసులను తొలగించుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రాధిక జైశ్వాల్, మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఏజెన్సీలో శాంతియుత వాతావరణమే లక్ష్యం

### ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్



**ఉట్నూర్, ప్రజానావ:** ఏజెన్సీ ప్రాంతంలో శాంతియుత వాతావరణాన్ని నెలకొల్పడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. గురువారం ఉట్నూర్ మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇటీవల జైనూర్ లో జరిగిన ఘటనపై రెండు రోజుల పాటు రాయిసెంటర్ సార్మెడిలు,రాజ్ గోండు సేవా సమితి,అన్ని ఆదివాసీ సంఘాలు,మైనారిటీ మత పెద్దలతో చర్చించిన విషయాలపై సీఎం రేవంత్ రెడ్డీ,గవర్నర్ జిష్ణుదేవ్ శర్మ,రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు మహమ్మద్ అలీ షబ్బీర్ ను జిల్లా ఇంఛార్జి మంత్రి సీతక్క తో కలసి పూర్తి నివేదికలను అందించామని పేర్కొన్నారు.త్వరలో గవర్నర్ అదిలాబాద్ జిల్లాలో పర్యటిస్తారనీ తెలిపారు. సిఎం రేవంత్ రెడ్డితో రాయి సెంటర్, రాజ్ గోండు సేవా సమితితో పాటు అన్ని ఆదివాసీ సంఘాలను కల్పిస్తామన్నారు. జైనూర్ ఘటన బాధితురాలికి న్యాయం చేస్తామని అన్నారు.ప్రతి రోజు ఆమె ఆరోగ్య పరిస్థితులను మంత్రి సీతక్క డాక్టర్లతో మాట్లాడి తెలుసుకుంటున్నారన్నారు.ఆ మహిళకు ప్రభుత్వం మెరుగైన వైద్య సేవలను అందిస్తోందనీ తెలిపారు.ఇరు వర్గాల వారు సంయమనం పాటించాలని కోరారు.ఆదివాసీల ఉద్యమాలు అర్థవంతమైనవిగా ఉండాలని అన్నారు.రాజకీయ పార్టీలు ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నం మానుకోవాలని హితవు పలికారు.నాన్ ట్రైబల్ లు 5వ షెడ్యూల్ లోనీ చట్టాలను గౌరవించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.ఆదివాసుల సంస్కృతి సంప్రదాయాలను భంగం కలగకుండా ఉండాలని సూచించారు.





యాదగిరిగుట్ట, వేములవాడ, భద్రాచలం, కొమురవెల్లి, కొండగట్టు, బాసర ఆలయాలకు సంబంధించి ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ సర్వసభ్య సమావేశాన్ని వేములవాడలోని ఎస్ ఆర్ ఆర్ గ్రాండ్ హోటల్ లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయా ఆలయాలకు సంబంధించిన ఉద్యోగులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వేములవాడ డిప్యూటీ ఇంజినీర్ మహిపాల్ ను అధికారులు సన్మానించారు.

- వేములవాడ, ప్రజానావ

## ఆదాయం ఫుల్.. సౌకర్యాలు నిల్!



- బురదలోనే వాంకిడి వార సంతలో విక్రయాలు
- వసతులు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు, పాలకులు

వాంకిడి, ప్రజానావ: వాంకిడి మండల కేంద్రంలో ప్రతి గురువారం నిర్వహించే వార సంతలో సమస్యలు రాజ్యమేలుతున్నాయి. మార్కెట్‌కు ఆదాయం ఫుల్ వస్తున్నా.. కనీస సౌకర్యాలు కరువయ్యాయి. సమస్యల మధ్యనే ప్రజలు కొనుగోళ్లు జరపాల్సిన పరిస్థితి నెలకొంది. మార్కెట్‌లో షెడ్లు లేక రోడ్లకు ఇరువైపులా తాత్కాలిక డేరాలు వేసుకుని వ్యాపారాలు విక్రయాలు జరుపుతున్నారు. వ్యాపారుల నుంచి పన్ను వసూలు చేస్తున్నా కనీసం తాగునీరు, మరుగుదొడ్లు, మూత్రశాలలు లేక నానా అవస్థలు పడాల్సి వస్తోంది. ఎన్నో ఏళ్లుగా వార సంతల్లో మౌలిక వసతులు కల్పించాలని వేడుకుంటున్నప్పటికీ గ్రామ పంచాయతీ అధికారులు, గుత్తేదారు పట్టించుకోవడం లేదని వ్యాపారులు వాపోతున్నారు. వర్షాకాలంలోనైతే ఇబ్బందులు చెప్పనలవి కావని వాపోతున్నారు. భారీవర్షాలు కురిసిన సమయంలో సంతకు తీసుక వచ్చిన సరుకులు పూర్తిగా వర్షంలో తడిసిపోతున్నాయని ఆందోళన చెందుతున్నారు. మార్కెట్ రోడ్లన్నీ బురదమయంగా కావడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. స్థలం సరిపోక కొంతమంది వ్యాపారులు రోడ్డు పక్కన, దుకాణాల ఎదుట విక్రయాలు జరుపుతున్నారు. డబ్బులు వసూలుచేస్తున్నా శ్రద్ధ విక్రయ కనీసం వసతులు కల్పించడంలో మాత్రం లో మాత్రం లేదు. వ్యాపారుల వద్ద నుండి గుత్తేదారు తక్కువ రుసుము వసూలు చేయాలని ఉన్నప్పటికీని అధిక రుసుము వసూలు చేస్తున్నారని ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. వార సంతలతో గ్రామపంచాయతీలకు కూడా ఆదాయం సమకూరుతుంది.. వార సంతకు ఆదాయం లక్షల్లో ఉన్నా సౌకర్యాలు మాత్రం కల్పించడం లేదని వ్యాపారులు వాపోతున్నారు. నేల పైనే కూర్చొని క్రయవిక్రయాలు చేస్తున్నారు. మండల వార సంత కు మారుమూల గ్రామాల నుండి ప్రజలు వస్తుంటారు కనీస మౌలిక వసతులు లేకపోవడం మరుగుదొడ్లు లేక ప్రజలు , ప్రత్యేకంగా మహిళలు తీవ్ర ఇబ్బందులకు గురి కావాల్సి వస్తుంది. గ్రామపంచాయతీ ఆదాయం కోసం ప్రతివారం వ్యాపారుల వద్దనుంచి డబ్బులు తీసుకుంటున్నా వసతులు మాత్రం కల్పించడం లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వార సంతలో మౌలిక సదుపాయాలు కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం..
శుక్రవారం
27 సెప్టెంబర్ 2024





# పెండింగ్ సమస్యల పరిష్కారానికి కృషి చేయండి

## మంత్రి పొన్నం ప్రభాకర్, వక్ఫ్ బోర్డు చైర్మన్‌కు కరీంనగర్ ముస్లిం జేఏసీ వినతి



**కరీంనగర్, ప్రజానావ:** గడచిన పది సంవత్సరాలలో గత ప్రభుత్వంలో హామీలు ఇచ్చి అమలు కాకుండా పెండింగ్ లో ఉన్న సమస్యలను కాంగ్రెస్ ప్రభుత్వంలోనైనా పరిష్కరించాలని కోరుతూ కరీంనగర్ ముస్లిం జేఏసీ అధ్యక్షుడు అబుబకర్ ఖలీద్ ఆధ్వర్యంలో రాష్ట్ర బీసీ సంక్షేమం, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ను హైదరాబాద్ లో గురువారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సచివాలయంలో కలిసి వినతి పత్రం అందజేశారు. కరీంనగర్ శివారులోని చింతకుంట వద్ద అసంపూర్తిగా ఉన్న మైనారిటీ కమ్యూనిటీ హాల్ను నిధులు మంజూరు చేసి పూర్తి చేయాలని, కరీంనగర్ లో మైనారిటీ స్టడీ సర్కిల్ ను ఏర్పాటు చేయాలని, వక్ఫ్ బోర్డులో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని, మదీనా కాంప్లెక్స్ లో నెలకొన్న సమస్యలను పరిష్కరించి కాంప్లెక్స్ ను ఆధునికరించాలని, ఉర్దూ మీడియం స్కూళ్లలో విద్యా వాలంటీర్లను నియమించాలని, ప్రస్తుత డీఎస్సీ లో ఉర్దూ మీడియం లో ప్రభుత్వం కేటాయించిన ఎస్సీ ఎస్టీ పోస్టులను డి రిసర్వ్ చేసి అర్హులైన అభ్యర్థులందరికీ ఉద్యోగాలు కల్పించాలని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ను కలిసి కరీంనగర్ ముస్లిం జేఏసీ నేతల వినతి పత్రాన్ని అందజేశారు. సానుకూలంగా స్పందించిన మంత్రి త్వరలో జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో వక్ఫ్ బోర్డు, మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్, ఉర్దూ అకాడమీ మూడు విభాగాలను కలిపి ఉన్నత స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించి, చేయాల్సిన పనులు, పెండింగ్లో ఉన్నటువంటి సమస్యల పరిష్కారానికి గల మార్గాలను అన్వేషించి అనంతరం ఈ మూడు విభాగాల రాష్ట్రస్థాయి చైర్మన్లను కరీంనగర్కు రప్పించి వారి ఎదుట ఈ సమస్యలన్నింటినీ ప్రస్తావించి పరిష్కారం చేసేందుకు తానే స్వయంగా తాను హాజరై, సమావేశంలోనే అప్పటికప్పుడే కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం మంత్రి ప్రభాకర్ వక్ఫ్ బోర్డు చైర్మన్ అజ్మతుల్లా హుస్సేనీ తో ఫోన్లో మాట్లాడారు కరీంనగర్ మైనార్టీలు ఎదుర్కొంటున్న సమస్యలపై కలిసి వాటి పరిష్కారానికి మార్గం చూపుదామని కోరారు. అనంతరం మంత్రి సూచనల మేరకు రాష్ట్ర వక్ఫ్ బోర్డు కార్యాలయం చైర్మన్ అజమతుల్లా హుస్సేనీ తో కరీంనగర్ ముస్లిం జేఏసీ నేతలు భేటీ అయ్యారు. వాక్స్ బోర్డు ఆధ్వర్యంలో మూడు రోజులపాటు వక్ఫ్ ప్రజా పాలన అనే కార్యక్రమాన్ని మంత్రి పొన్నం ప్రభాకర్ సూచనల మేరకు కరీంనగర్ నుంచి మొదలు పెడతామని, ఈ మూడు రోజుల్లో కరీంనగర్ జిల్లాలోని సమస్యలన్నింటిని రాష్ట్ర వక్ఫ్ బోర్డు కార్యాలయంలోని యావత్తు ఉద్యోగులు కరీంనగర్లో క్యాంపు ఏర్పాటు చేసి అప్పటికప్పుడే సమస్యల పరిష్కారానికి కృషి చేసే విధంగా సన్నాహాలు చేస్తున్నామన్నారు. ఈకార్యక్రమంలో ముఫ్తి ఫియాస్ మొహియుద్దీన్, మజర్ మొహియుద్దీన్ సాజిద్, ఫసియుద్దీన్ నవాబ్, జమిలోద్దీన్, సమద్ నవాబ్, ఎండి తాజుద్దీన్, అబ్బాస్ సమీ, ఎస్ఏ మొహాసీన్, సదర్ ఖాజీ మంఖబత్ ఖాన్, హాఫిజ్ జియఉల్లాహ్ ఖాన్, ఎంఏ ఖలీద్, జమీల్, జుబేర్ అహ్మద్, వసిముద్దీన్, షోయబ్ లతిఫీ, లయిక్ ఖాద్రి, నిహాల్, అహ్మద్ అలీ, ఖాజాఖాన్, ఎంఏ మతిన్, చాన్, జాఫర్, సాధక్ అలీ తదితరులు పాల్గొన్నారు.

# బావిలో పడిన మతిస్థిమితం లేని మహిళ

## సాహసం చేసి కాపాడిన ఫైర్ పోలీసు సిబ్బంది

## హర్షం వ్యక్తం చేసిన ప్రజలు



**హుజురాబాద్, ప్రజానావ:** మతిస్థిమితం లేని ఓ మహిళ బావిలో పడిన సమాచారం తెలిసిన వెంటనే ఫైర్ పోలీసులు స్పందించి, సంఘటన స్థలానికి చేరుకొని మహిళను సురక్షితంగా బావిలో నుంచి బయటకు తీసి కాపాడినారు. వివరాల్లోకి వెళితే కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ మండలం సిర్సపల్లి గ్రామానికి చెందిన మన్యాల శారధ (45) మతి స్థిమితం లేక గ్రామంలోని పెద్ద బావిలో దూకింది. స్థానిక ప్రజలు వెంటనే హుజురాబాద్ లోని ఫైర్ స్టేషన్ కి కాల్ చేసి సమాచారం అందించారు. వెంటనే ఫైర్ సిబ్బంది బయలుదేరి గ్రామానికి చేరుకొని ఆ మహిళ పడిన బావిలో దిగి సురక్షితంగా బయటకు తీసి శారద ప్రాణాలను కాపాడారు. పోలిసుల సాహసాన్ని పలువురు మెచ్చుకున్నారు. బావిలో పడిన మహిళను ఎంతో చాకచక్యంగా ప్రాణాలతో బయటకు తీసి కాపాడిన హుజురాబాద్ ఫైర్ సిబ్బంది ఏ.ఎల్.ఎఫ్. ఎం. శ్రీనివాస్, డి.ఓపి ప్రభాకర్, ఫైర్మెన్ లు సందీప్, అనిల్ కుమార్, శివారెడ్డిలను గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

# రోడ్డు పక్కన చెట్లు తొలగింపు



**గన్నేరువరం, ప్రజానావ:** మండలం కేంద్రంలోని చెరువు కట్టమీద మూల మలుపుల వద్ద రోడ్డుకు ఇరువైపులా గుబురుగా పెరిగిన ముళ్ళ చెట్లు, కొమ్మలును ప్రమాదాలు జరుగకుండా గురువారం గ్రామ పంచాయితీ సిబ్బంది జేసీబీ తో తొలిగించారు. రోడ్డుకు అడ్డుగా ఉన్న చెట్లు, కొమ్మలు, ముళ్లకంపలను తొలగింపజేశారు. చెట్ల కొమ్మలతో ప్రతి రోజు ఇబ్బంది పద్దామని వాహనదారులు తెలిపారు. గ్రామ పంచాయితీ సిబ్బంది పనితీరును పలువురులు ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రెటరీ,వెంకట్ రెడ్డి, కారోబార్ మాధవరావు, పాశం ప్రభాకర్ యాదవ్,శంకర్, సిబ్బంది పాల్గొన్నారు.




# రాజకీయాల్లో విద్యావేత్తలకు అవకాశం ఇవ్వండి

## పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి అల్ఫోర్స్ నరేందర్ రెడ్డి

**నిజామాబాద్, ప్రజానావ:** రాజకీయాల్లో చదువుకున్న మేధావులు, విద్యావేత్తలకు అవకాశం కల్పిస్తే సమాజం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి అల్ఫోర్స్ నరేందర్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కరీంనగర్, నిజామాబాద్, మెదక్, ఆదిలాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో తనను గెలిపించాలని కోరారు. విద్యావంతులు ఎన్నికల్లో గెలిస్తే ప్రజలసమస్యలనుపరిష్కరించగలరని అన్నారు. విద్యారంగ సమస్యలు పరిష్కరించడంలో తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.. నిరుద్యోగులకు ప్రత్యేక జాబ్ క్యాలెండర్ ప్రకటన కోసం ప్రభుత్వం పై ఒత్తిడి తెస్తానని పేర్కొన్నారు.. ప్రభుత్వ ఉద్యోగులకు దీటుగా ప్రైవేటు ఉద్యోగులకు అన్ని రకాల వసతులతో పాటు ఉద్యోగ అవకాశాల కల్పనకై కృషి చేస్తానని వెల్లడించారు.. ప్రభుత్వ ప్రభుత్వ ప్రైవేటు ఉద్యోగులు ఎదుర్కొంటున్న హెల్త్ కార్డుల జారీ సమస్యను పరిష్కరిస్తానని అన్నారు.. పట్టభద్రులందరు స్వచ్ఛందంగా ఓటు నమోదుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు.. పట్టభద్రుల వివిధ విద్యాసంస్థలు ఎదుర్కొంటున్న సమస్యల ప రిష్కారానికి కృషి చేస్తానని.. రానున్న పట్టబద్రుల ఎన్నికల్లో తనకు మద్దతు ఇచ్చి గెలిపించాలని కో రారు. ఈ కార్యక్రమంలో ట్రస్మా,TPJMA, TPDMA రాష్ట్ర ప్రతినిధులు మేధావులు,విద్యావేత్తలు పాల్గొ న్నారు. మీడియా సమావేశం అనంతరం జిల్లా కోర్టు లో న్యాయవాదులతో,, పలు డిగ్రీ కళాశాలలు జూనియర్ కళాశాలలు, ప్రభుత్వ సంస్థలను సందర్శించి తనకు మద్దతు తెలిపాలని కోరారు





# ఆరోగ్య సమాజాన్ని నిర్మించుకోవాలి

**బెజ్జంకి, ప్రజానావ:** మండలంలోనీ దాచారం గ్రామంలో స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమంలో భాగంగా గురువారం ముఖ్యఅతిథిగా జెడ్పి సీఈవో రమేష్, డిఆర్డిఓ జయాదేవ్ ఆర్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని,ఈ కార్యక్రమం అక్టోబర్ రెండు వరకు నిర్వహించడం జరుగుతుందని, గ్రామంలో ప్లాస్టిక్ వాడడం నిషేధించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ప్రాజెక్ట్ డైరెక్టర్ మధుసూదన్ ఎంపీడీవో కడవెరి ప్రవీణ్, ఏపీఎమ్ నరసయ్య, ఏపీవో, కూలీలు, మహిళా సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా చాకలి ఐలమ్మ జయంతి



**గన్నేరువరం, ప్రజానావ:** రజక సంఘం ఆధ్వర్యంలో వీరనారి చాకలి ఐలమ్మ 129.వ.జయంతి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన తాసిల్దార్ నరేందర్ తాజా మాజీ సర్పంచ్ పుల్లెల లక్ష్మీ లక్ష్మణ్ మాజీ వైస్ ఎంపీపీ,న్యాత స్వప్న, సుధాకర్, బొడ్డు సునీల్, చాకలి ఐలమ్మకు విగ్రహానికి పూలమాలవేసి నివాళులు అర్పించి కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు.అనంతరం తాసిల్దార్ మాట్లాడుతూ, భూమికోసం భుక్తి కోసం వెట్టి చాకిరి విభక్తి కోసం పోరాడిన తెలంగాణ ప్రజల తెగును పోరాటం స్ఫూర్తిని ప్రపంచానికి చాటి చెప్పిన, వీరనారి ఐలమ్మ బహుజన ఆత్మగౌరానికి మహిళ చైతన్యానికి ప్రత్యేకగా నిలుస్తారని స్మరించుకున్నారు. అనంతరం రజక సంఘం ఆధ్వర్యంలో నూతనంగా ఎన్నికైన వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ గా మాతంగి అనిల్ ను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్లు,మాతంగి అనిల్, నల్ల చంద్ర రెడ్డి, చింతల శ్రీధర్ రెడ్డి, ముత్యాల జగన్ రెడ్డి, కాంతాల అంజిరెడ్డి, బీసీ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పుల్లెల జగన్మోహన్, పుల్లెల రాము,మునిగంటి మల్లయ్య మునిగంటి మొండయ్య, నాగరాజు మునిగంటి తిరుపతి, రాములు,శ్రీధర్ అంజి తదితరులు పాల్గొన్నారు



# నల్ల బ్యాడ్జీలతో నిరసన

**బెజ్జంకి, ప్రజానావ:** బెజ్జంకి మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఎంపీడీవో ప్రవీణ్, సూపరిండెంట్ ఆంజనేయులు, ఆధ్వర్యంలో నల్లగొండ జిల్లాలో ఎంపీడీవో, పంచాయతీ కార్యదర్శులను సస్పెండ్ చేసినందున నల్ల బ్యాడ్జీలు ధరించి, సస్పెండ్ అయిన వారికి సంఘీభావంగా నిరసన తెలియజేశారు. ఈ కార్యక్రమంలోసీనియర్ అసిస్టెంట్ రాధా కిషన్ రెడ్డి, జూనియర్ అసిస్టెంట్స్ ప్రకాష్, సతీష్, ఏపీవో రాజబాబు,పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ కార్యాలయ సిబ్బంది, ఈ పంచాయతీ ఆపరేటర్లు పాల్గొన్నారు.


# యువత నైపుణ్యాభివృద్ధికి కృషి

## రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు జిల్లెల చిన్నారెడ్డి



**వనపర్తి, ప్రజానావ:** జిల్లాలోని యువతను విద్యతో పాటు అన్ని రంగాల్లో నైపుణ్యాభివృద్ధి సాధించేందుకు తనవంతు కృషి చేస్తానని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు డా. జిల్లెల చిన్నా రెడ్డి అన్నారు. జిల్లా యువజన క్రీడల శాఖ ఆధ్వర్యంలో గురువారం బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో ఉన్న ఇండోర్ స్టేడియంలో జిల్లా స్థాయి యువజనోత్సవాలు నిర్వహించగా ఈ కార్య క్రమానికి రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు, అదనపు కలక్టర్ సంచిత్ గంగ్వార్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. జిల్లాలోని 15 నుండి 29 సంవత్సరాల వయసు కలిగిన యువతకు సాంస్కృతిక, జానపద నృత్యం, జానపద గీతాపన, వ్యాస రచన, చిత్రలేఖనం, ఉపన్యాస, కవిత్వం వంటి రంగాల్లో పోటీలు నిర్వహించి మొదటి, ద్వితీయ స్థానంలో వచ్చిన కళాకారులకు బహుమతులు ఇవ్వడంతో పాటు రాష్ట్ర స్థాయి పోటీలకు పంపడం కార్యక్రమ ముఖ్య ఉద్దేశ్యం. ఈ సందర్భంగా స్వామి వివేకానందుని చిత్ర పటానికి పూల మాలతో నివాళులు అర్పించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేడు వీర నారి చాకలి ఐలమ్మ జయంతి ఉన్నదని మహిళలు ఆమెను స్ఫూర్తి గా తీసుకోవాలని సూచించారు. విద్యార్థులు విద్యతో పాటు క్రీడలు, సాంస్కృతి కార్యక్రమాలలో సైతం రాణించాలని సూచించారు. జిల్లాలో క్రీడలను ప్రోత్సహించేందుకు ఇప్పుడు ఉన్న ఇండోర్ స్టేడియాన్ని రెనోవేశన్ చేయించేందుకు కృషి చేస్తానని చెప్పారు. విద్యార్థులు పోటీ ప్రపంచంలో ఉన్నారని, పోటీని తట్టుకొని విజయాన్ని అందుకునే విధంగా జిల్లాలో నైపుణ్య శిక్షణ కేంద్రం ఏర్పాటుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. అదనపు కలక్టర్ లోకల్ బాడీస్ సంచిత్ గంగ్వార్ మాట్లాడుతూ విద్యార్థులు కేవలం చదువుకొనే కాకుండా క్రీడలు, సాంస్కృతిక కళల్లో నైపుణ్యం సాధించాలని సూచించారు. అనంతరం విద్యార్థులు ఏర్పాటు చేసిన సైన్స్ ఫేర్ కార్యక్రమాలను తిలకించారు. జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి సుధీర్ రెడ్డి, జిల్లా పౌర సంబంధాల అధికారి సీతారం, జిల్లా ఇంటర్మీడియట్ నోడల్ అధికారి అంజయ్య, పి.ఈ.టి. సురేందర్ రెడ్డి, మాజీ జడ్పీటిసి రాజేంద్ర ప్రసాద్, జిల్లా సీనియర్ కళాకారుడు డప్పు స్వామి విద్యార్థులు, కళాకారులు తదితరులు పాల్గొన్నారు...

# వడ్డెరుల సమస్యలు తీర్చండి



**మెదక్, ప్రజానావ:** వడ్డెరుల సమస్యలు తీర్చాలని కొల్చారం మండల వడ్డెర సంఘం అధ్యక్షుడు జరుపటి రాజు, తెలంగాణ రాష్ట్ర వడ్డెర సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎత్తిరి మారయ్యతో కలిసి గురువారం నాడు తెలంగాణ రాష్ట్ర ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్ జరుపటి జైపాల్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర వడ్డెర సంక్షేమ సంఘం అధ్యక్షుడు మారయ్య మాట్లాడుతూ కొల్చారంలో ఫారెస్ట్ అధికారులు వడ్డరులను రాళ్లు కొట్టకుండా అడ్డుకుంటున్నారని తమ దృష్టికి వచ్చిందన్నారు. కాగా గ్రామంలోని వడ్డరులు స్థానిక తిరుమలయ్య గుట్ట ప్రాంతంలో తరాలుగా రాయి కొట్టి జీవనం సాగిస్తున్నారన్నారు. ఇటీవల నూతనంగా వచ్చిన బీట్ ఆఫీసర్ వారిని రాళ్లు కొట్టనీయడం లేదని, దీంతో వారి ఉపాధి దెబ్బతింటుందని, వారి కుటుంబాలు రోడ్డున పడతాయి అన్నారు. వడ్డరులకు రాళ్లు కొట్టడం తప్ప మరో పని రాదన్నారు. ఈ విషయమై తాము తెలంగాణ రాష్ట్ర ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్ జైపాల్ ను కలువగా సానుకూలంగా స్పందించి, ఈ సమస్యను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్కు లేఖ రాశారన్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ వడ్డెర సంఘం అధ్యక్షులు వేముల వెంకటేశం, తెలంగాణ రాష్ట్ర వడ్డెర సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎత్తరి మారయ్య, కొల్చారం మండల అధ్యక్షుడు జరుపటి రాజు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా చాకలి ఐలమ్మ జయంతి



**ఎండపల్లి, ప్రజానావ:** మండల కేంద్రంలో తెలంగాణ వీర వనిత చాకలి ఐలమ్మ 129 వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. రజక సంఘం మండల కమిటీ ఆద్వర్యంలో మండల కేంద్రంలోని ప్రధాన రహదారి కూడలీలో ఐలమ్మ చిత్రపటానికి పూల వేసి నివాళులు అర్పించారు. అదే విధంగా ఎండపల్లి గ్రామంలో రజక సంఘం అధ్యక్షుడు నర్పూరి మల్లేష్ ఆద్వర్యంలో,వివేకానంద యూత్ ఆద్వర్యంలో అమె చిత్రపటానికి పూల మాల వేసి ఆమె సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా రజక సంఘం నాయకులు మాట్లడుతూ భూమికోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరీ విముక్తి కోసం పెత్తందారులకు వ్యతిరేకంగా పోరాడారని, తెలంగాణ సాయుధ పోరాటంలో ఐలమ్మ ప్రదర్శించిన ధైర్యసాహసాలు ప్రజాస్వామిక పోరాటాలకు స్ఫూర్తిగా నిలిచాయన్నారు. ఆమె తెగువ, పౌరుషం తెలంగాణ అస్థిత్వాన్ని, ఆత్మగౌరవన్ని చాటి చెప్పాయని మనందరం ఐలమ్మ పోరాట స్పూరితో వారి ఆశయాలకు అనుగుణంగా ముందుకు సాగాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల రజక సంఘం అధ్యక్షులు నేరేళ్ల అశోక్, గౌరవ అధ్యక్షుడు కాల్వ రమేష్, ప్రధాన కార్యదర్శి మైలారం సతీష్, శ్రీనివాస్, కాల్వ శంకరయ్య, వర్ధవెల్లి తిరుపతి, కలకోట పోచయ్య, నస్పూరి రాజేష్, దళిత యువనేత ఆరెల్లి బాబా రాజు, యుదిరాజ్ సంఘం నాయకులు రాయిల్లా భూమేష్, వివేకానంద యూత్ అధ్యక్షుడు నగేష్, ఉపాధ్యక్షుడు తిరుపతి,రాజేందర్, కిరణ్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.




# స్వచ్ఛత హి సేవా కార్యక్రమం

**భద్రాద్రి కొత్తగూడెం, ప్రజానావ:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గౌందిగూడెం గ్రామ పంచాయతీ పరిధిలో ఐటీసీ బంగారు భవిష్యత్ వారి సహకారంతో సొసైటి ఫర్ సంపూర్ణ గ్రామ స్వరాజ్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో స్వచ్ఛత సేవా కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. విద్యార్థులు, ఉపాధ్యాయులు, మరియు సిబ్బంది కలిసి పాఠశాల ప్రాంగణంలో స్వచ్ఛత సేవా ప్రతిజ్ఞ చేశారు. ఈ ప్రతిజ్ఞ ద్వారా పర్యావరణ పరిరక్షణ, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం, మరియు పరిశుభ్రతను కాపాడుకోవడం వంటి అంశాల పట్ల కట్టుబడి ఉండాలని ప్రతిజ్ఞ చేశారు. ప్రతిజ్ఞ అనంతరం, విద్యార్థులు, ఉపాధ్యాయుల నేతృత్వంలో గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో విద్యార్థులు స్వచ్ఛ భారత్ సమర్థ భారత్ ప్లాస్టిక్ మానండి పర్యావరణాన్ని కాపాడండి వంటి నినాదాలతో ప్రజలకు సందేశం అందించారు. ర్యాలీ ద్వారా గ్రామ ప్రజల్లో పరిశుభ్రతపై అవగాహన కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థుల సంఖ్య 60మంది విద్యార్థులు, పాల్గొన్న ఉపాధ్యాయుల సంఖ్య:-నలుగురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఎన్ జీవో నుండి రంగారావు ఏపీవో ముఖ్య అతిథిగా హాజరై, విద్యార్థులకు స్వచ్ఛత సేవ గురించి ప్రాముఖ్యతను వివరించారు.

పాఠశాల హెచ్ ఎం శాంతన్ కుమార్ విద్యార్థులకు మార్గదర్శనం చేస్తూ, వారి భవిష్యత్‌కు పరిశుభ్రత ఎంత ముఖ్యమో వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, గ్రామ సర్పంచ్ పాయం భద్రమ్మ ఎస్ ఎస్ జి ఎస్ సివో ముత్యాలరావు రాజేష్ గ్రామ పెద్దలు హెల్త్ వర్కర్స్ ద్వారా విద్యార్థుల్లో సేవా భావం పెంపొందించడమే కాకుండా, ప్రజల్లో పరిశుభ్రతపై చైతన్యాన్ని తీసుకొచ్చింది.



# రాష్ట్ర నాయకురాలిని కలిసిన రాసూరి

**బెజ్జంకి, ప్రజానావ:** రాష్ట్ర మహిళా సహకార అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ బండ్రు శోభారాణి ని గురువారం మానకొండూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో కవ్వంపల్లి సత్యనారాయణ ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా కలిసిన టి పి సి సి, ఆర్టిఐ ప్రచార కమిటీ చైర్మన్ రాసూరి మల్లికార్జున్, వీరి వెంట వివిధ శాఖల నాయకులు కార్యకర్తలు ఉన్నారు.

# ఇండియన్ బ్యాంకు ముందు రెండో రోజు రైతుల నిరసన



**బెజ్జంకి, ప్రజానావ:** మండల పరిదిలోని తోటపల్లి గ్రామం లో గల ఇండియన్ బ్యాంక్ ముందు గురువారం బ్యాంక్ లో ఖాతాలు కలిగిన పలు గ్రామాల రైతులు ఋణమాఫీ కాలేదంటూ రెండు రోజులుగా నిరసన చేపట్టారు. బ్యాంక్ వద్ద రైతులు నిరసన చేస్తారనే ముందస్తు సమాచారంతో ఎస్.ఐ కృష్ణారెడ్డి, పోలీసు సిబ్బందితో కలిసి వెళ్లి రైతులను శాంతింప చేశారు. ఈ సందర్భంగా ఎస్.ఐ తో స్థానిక రైతులు తమకు ఋణమాఫి జరిగేంత వరకు నిరసనలు చేపడతామని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన ఋణమాఫీ పథకంలో భాగంగా రెండు లక్షల వరకు ఋణాలను మాఫి చేస్తామని, ఎన్నికల్లో హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టాకా రైతులను విస్మరించిందని స్థానిక రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా తోటపల్లి ఇండియన్ బ్యాంక్ శాఖ పరిదిలో సుమారుగా 800 మంది రైతులకు ఋణామాఫీ జరగలేదన్నారు. ప్రభుత్వం స్పందించి రైతులను రుణమాఫీ చేసి ఆదుకోవాలని పలు గ్రామాల రైతులు కోరారు.

# లోక్‌అదాలత్‌లో కేసులు పరిష్కరించుకోవాలి

## అడిషనల్ ఎస్పీ రామదాసు తేజావత్



**వనపర్తి, ప్రజానావ:** ఈ నెల 28న వనపర్తి జిల్లా కోర్ట్, ఆత్మకూర్ కోర్టులో జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమం ఉన్నదని, జాతీయ లోక్ అదాలత్‌లో సామరస్య ధోరణితో రాజీ పడదగిన వివిధ కేసులపై న్యాయ స్థానాల చుట్టూ తిరగకుండా కేసుల పరిష్కారం చేసుకోవాలని వనపర్తి జిల్లా అడిషనల్ ఎస్పీ శ్రీరామదాసు తేజావత్ సూచించారు. అలాగే జాతీయ లోక్ అదాలత్ లో రాజీపడే అవకాశం ఉన్న కేసులను లిస్ట్ అవుట్ చేసుకోవాలని, రాజీ పడదగిన కేసుల్లో ఇరువర్గాల వారిని పిలిపించి చిన్నచిన్న కేసులతో జీవితాలు నాశనం చేసుకో వద్దని ఒకే గ్రామం లో ఉండే వారు ఎప్పుడూ కలిసి మెలిసి ఉంటారు కాబట్టి రాజీ మార్గమే రాజ మార్గమని వారికి అర్థమయ్యే విధంగా తెలపాలని జిల్లా సిబ్బందికి సూచించారు. అలా లిస్ట్ అవుట్ చేసిన కేసులలో అన్ని కేసులు రాజీ పడేటట్లు ప్రతి కోర్ట్ లైజనింగ్ ఆఫీసర్స్ మరియు కోర్ట్ కానిస్టేబుళ్లు మరియు సిబ్బంది కృషి చేయాలని తెలిపారు. అలాగే న్యాయశాఖ అధికారులతో సమన్వయం ఏర్పరచుకొని విధులు నిర్వహించాలని పేర్కొన్నారు. జాతీయ లోక్ అదాలత్ లో సాధ్యమైనంత వరకు ఎక్కువ మొత్తంలో కేసులు రాజీ కుదిరేలా చూడాలన్నారు. కోర్టు విధులు నిర్వహించే ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా విధులు నిర్వహించి రాజీ కాదగ్గ కేసులలో రాజీ శాతం పెంచాలని సూచించారు. కోర్ట్ ఆవరణలో ఈ నెల 28 నాడు జాతీయ లోక్ అదాలత్ నిర్వహింపబడుతుందన్నారు. ఈ అవకాశాన్ని రాజీ కాదగ్గ కేసులు ఉన్నవారు సద్వినియోగించుకోవాలని అడిషనల్ ఎస్పీ సూచించారు.

ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం..
శుక్రవారం
27 సెప్టెంబర్ 2024




# కాన్పూర్ టెస్టుకు వరుణ గండం

## భారీ భద్రత ఏర్పాట్లు

**కాన్పూర్ :** తొలి టెస్టులో బంగ్లాదేశ్‌పై ఘన విజయం సాధించిన టీమిండియా రెండో మ్యాచ్‌లోనూ అదే రిజల్ట్‌ను రిపీట్ చేయాలనుకుంటోంది. చెన్నైలో అన్ని విభాగాల్లోనూ సత్తా చాటిన జట్టు కాన్పూర్‌లో శుక్రవారం నుంచి జరిగే రెండో టెస్టులోనూ ఆల్‌రౌండ్ పెర్ఫామెన్స్‌తో మెప్పించి సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేసేందుకు రెడీ అవుతోంది. ఇదంతా బాగానే ఉన్నా ఈ మ్యాచ్‌కు వాన ముప్పు ఆందోళన కలిగిస్తోంది. అకాల వర్షాలు కాన్పూర్ టెస్టులో తొలి రెండు రోజులకు ఇబ్బంది కలిగించే చాన్సుంది. వాతావరణ శాఖ అంచనా ప్రకారం శనివారం వరకూ ఉరుములతో కూడిన భారీ వర్షం కురిసే అవకాశం ఉంది. మ్యాచ్ తొలి రోజైన శుక్రవారం వర్షం కురిసే చాన్స్ 92 శాతం, శనివారం 90 శాతం ఉండటం ఆందోళన కలిగిస్తోంది. దాంతో యూపీ క్రికెట్ అసోసియేషన్ (యూపీసీఏ) ఔట్ ఫీల్డ్‌ను కప్పేందుకు డీడీసీఏ నుంచి అదనపు కవర్లు తెప్పించింది. ఈ మ్యాచ్ కోసం గ్రీన్ పార్క్ స్టేడియం వద్ద



భారీ భద్రత ఏర్పాటు చేశారు. బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులకు నిరసనగా మ్యాచ్ సందర్భంగా ఆందోళన చేస్తామని హిందూ మహాసభ హెచ్చరించింది. దాంతో, హెూటల్ నుంచి గ్రౌండ్ వరకూ యాంటీ టెర్రరిజం స్క్వాడ్ (ఏటీఎస్)తో కూడిన మూడంచెల భద్రతను రెండు జట్లకు కల్పించినట్లు కాన్పూర్ పోలీసులు తెలిపారు. వర్షం, భద్రతతోనే కాకుండా ఈ మ్యాచ్‌లో గ్రీన్ పార్క్ స్టేడియంలోని ఓ స్టాండ్ విషయంలోనూ నిర్వాహకులకు తలనొప్పి వచ్చిపడింది. స్టేడియంలోని బాల్కనీ-సి స్టాండ్ ప్రమాదకరంగా ఉందని యూపీ పబ్లిక్ వర్క్స్ డిపార్ట్‌మెంట్ (పీడబ్ల్యూడీ) ఇంజనీర్ల బృందం తెలిపింది. ప్రేక్షకులు ఎక్కువగా వస్తే స్టాండ్ కూలిపోయే అవకాశం ఉందని అంచనా వేసింది. దీన్ని రిపేర్ చేయడానికి సమయం లేకపోవడంతో 4800 సీట్ల సామర్థ్యం ఉన్న స్టాండ్‌లో తొలుత 1700 టికెట్లు మాత్రమే అమ్మాలని భావించారు. తర్వాత ఆ స్టాండ్ మొత్తాన్ని మూసివేయాలని నిర్ణయించారు. చెన్నై చెపాక్ స్టేడియంలో ఎర్రమట్టితో తయారు చేసిన వికెట్‌పై మొదట బౌన్స్ లభించి తర్వాత ఫ్లాట్‌గా మారి బ్యాటర్లకు అనుకూలించింది. చివర్లో స్పిన్నర్లకు సపోర్ట్ ఇచ్చింది. అయితే, నల్ల మట్టితో కూడిన కాన్పూర్ వికెట్ స్లోగా ఉండి స్పిన్నర్లకు అనుకూలిస్తుందని భావించినా.. ఇది కూడా చెన్నై మాదిరిగానే స్పందిస్తుందని గ్రీన్ పార్క్ క్యూరేటర్ శివ్ కుమార్ చెబుతున్నాడు. ఐదు రోజులు మన్నికగా ఉండే వికెట్ తొలి రెండు సెషన్లలో పేసర్లకు తర్వాతి మూడు రోజుల్లో స్పిన్నర్లకు సపోర్ట్ ఇస్తుందని చెప్పాడు. ఈ నేపథ్యంలో లోకల్ స్టార్ కుల్దీప్ యాదవ్‌ను తుది జట్టులోకి తీసుకొని ముగ్గురు స్పిన్నర్లతో బరిలోకి దిగడం ఖాయం అనిపిస్తోంది.



# రోహిత్‌కు బౌలింగ్ చేయడం చాలా కష్టం

### ఆసీస్ బౌలర్ హెజిల్ వుడ్

**మెల్‌బోర్న్:** క్రికెట్ ఫ్యాన్స్‌కు టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ గురించి ప్రత్యేకంగా పరిచయం చేయాల్సిన పనిలేదు. ఇటీవల జట్టుకు టీ20 ప్రపంచకప్ అందించి.. ఎన్నో ఏళ్ల కల నెరవేర్చారు. ప్రస్తుతం బంగ్లాదేశ్‌తో భారత్ వేదికగా టెస్టు సిరీస్ ఆడుతున్నారు. ఇదిలా ఉండగా.. రోహిత్ శర్మపై ఆస్ట్రేలియా పేసర్ హెజిల్ వుడ్ ప్రశంసల వర్షం కురిపించారు. ఇటీవల ఆయన ఓ ఇంటర్వ్యూలో మాట్లాడారు. ఫాస్ట్ బౌలర్లను ఎదుర్కొనే విషయంలో, అదే ఫాస్ట్ బౌలింగ్‌లో బౌన్సర్లను ఎదుర్కొనే విషయంలో రోహిత్ శర్మకు ఎవరూ సాటిలేరు అని అన్నారు. ఆ బాల్స్ ఆయన్ను ఏమాత్రం ఇబ్బంది పెట్టబోవని తెలిపారు. వేగంగా వచ్చే బంతుల్ని క్షుణ్ణంగా చదవి, సునాయాసంగా ఎదుర్కుంటారని చెప్పుకొచ్చారు. ప్రస్తుతం రోహిత్‌కు బౌలింగ్ చేయడం చాలా కష్టతరమైన విషయమని అన్నారు. మరోవైపు.. చెన్నై వేదికగా జరిగిన తొలి టెస్ట్‌లో బంగ్లాదేశ్‌ను చిత్తుగా ఓడించిన భారత్ ఫుల్ జోష్‌లో ఉంది. తమను ఓడిస్తామంటూ సిరీస్‌కు ముందు ఓవరాక్షన్ చేసిన షంటో సేనను మూడు చెరువుల నీళ్లు తాగించింది. ఈ క్రమంలోనే రెండో టెస్ట్‌లోనూ నెగ్గి బంగ్లాను వైట్‌వాష్ చేయాలని డిసైడ్ అయింది.

# ఐసీసీ టెస్ట్ ర్యాంకింగ్స్

దుబాయ్ : టీమిండియా వికెట్ కీపర్ రిషబ్ పంత్.. ఐసీసీ టెస్ట్ ర్యాంకింగ్స్‌లో టాప్-10లోకి దూసుకొచ్చాడు. బుధవారం విడుదల చేసిన తాజా జాబితాలో అతను 731 రేటింగ్ పాయింట్లతో ఆరో ర్యాంక్‌ను సాధించాడు. బంగ్లాదేశ్‌తో తొలి టెస్ట్‌లో సెంచరీ చేయడంతో పంత్ ర్యాంక్ మెరుగైంది. ఓపెనర్ యశస్వి జైస్వాల్ (751) ఒక్క స్థానం మెరుగుపడి ఐదో ర్యాంక్‌లో నిలిచాడు. స్టార్ బ్యాటర్లు రోహిత్ శర్మ (716), విరాట్ కోహ్లీ (709) చెరో ఐదు ప్లేస్‌లు దిగజారి వరుసగా 10, 12వ ర్యాంక్‌లకు పడిపోయారు. శుభ్‌మన్ గిల్ (701) ఐదు ప్లేస్‌లు ఎగబాకి 14వ ర్యాంక్‌ను సొంతం చేసుకున్నాడు. జో రూట్ (852), విలియమ్సన్ (852), డారిల్ మిచెల్ (760), స్మిత్ (757) టాప్-4లో ఉన్నారు. బౌలింగ్‌లో అశ్విన్ (871), బుమ్రా (854) టాప్-2లోనే కొనసాగుతున్నారు. జడేజా (804) ఆరో స్థానానికి ఎగబాకగా, కుల్దీప్ యాదవ్ (679) 16వ ర్యాంక్‌లో నిలిచాడు.





# విరాట్‌లో ఊపు కనిపించడం లేదు

### ఆసీస్ మాజీ క్రికెటర్ బ్రాడ్ హాగ్

**మెల్‌బోర్న్:** టీమిండియా స్టార్ బ్యాటర్, రన్ మెషిన్ విరాట్ కోహ్లి పై ఆసీస్ మాజీ క్రికెటర్ బ్రాడ్ హాగ్ కీలక వ్యాఖ్యలు చేశారు. కోహ్లిలో మునుపటిలాగా పరుగుల కసి తగ్గిందని, ఊపు కనిపించడం లేదని హాగ్ ఆరోపించాడు. గత కొంతకాలంగా విరాట్ టెస్టుల్లో అంత గొప్ప ప్రదర్శన ఏమీ చేయడం లేదని అభిప్రాయపడ్డారు. ఇలాగే ఆడితే విరాట్ కోహ్లీ సచిన్ గత రికార్డులు అధిగమించడం చాలా కష్టమని అభిప్రాయం వ్యక్తం చేశాడు.కాగా, మాస్టర్ బ్లాస్టర్ సచిన్ టెండూల్కర్ తన కెరీర్‌లో 200 టెస్టులు ఆడి 15,921 పరుగులు చేయగా.. 35 ఏళ్ల విరాట్ ఇప్పటివరకు 114 టెస్టులు ఆడి 8,871 పరుగులు మాత్రమే సాధించాడు. విరాట్ సచిన్ రికార్డును అధిగమించాలంటే మరో 7,051 పరుగులు చేయాల్సి ఉంటుంది. ప్రస్తుత ఫామ్‌తో కోహ్లి ఇన్ని పరుగులు సాధించడం దాదాపుగా అసాధ్యమే అని హాగ్ చెప్పుకొచ్చారు.

# టీ20 క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించిన షకీబ్



**కాన్పూర్:** బంగ్లాదేశ్ ఆల్ రౌండర్ షకీబ్ అల్ హసన్.. టీ20 క్రికెట్‌కు గుడ్‌బై చెప్పారు. తక్షణమే తన నిర్ణయం అమలులోకి వస్తుందన్నారు. ఒకవేళ స్వదేశంలో ఫేర్‌మ్యాచ్ లేకుంటే, అప్పుడు కాన్పూర్‌లో భారత్‌తో జరిగే రెండో టెస్టు మ్యాచ్ తనకు చివరిది అవుతుందని పేర్కొన్నారు. 37 ఏళ్ల షకీబ్ 129 టీ20లు ఆడారు. టీ20 వరల్డ్‌కప్ సమయంలోనే చివరి టీ20 మ్యాచ్ ఆడేశానని, సెలెక్టర్లతో ఈ అంశాన్ని చర్చించానని, 2026 వరల్డ్‌కప్‌ను గమనిస్తే, ఇక జట్టు నుంచి తప్పుకోవడం సబబే అని అర్థమవుతోందన్నారు. షకీబ్ మొత్తం 69 టెస్టులు ఆడాడు. వాటిల్లో 4453 పరుగులు చేశాడు. 242 వికెట్లు కూడా తీశాడు. మీర్పూర్‌లో చివరి టెస్టు ఆడాలన్న కోరికను క్రికెట్ బోర్డుకు చెప్పానని, వాళ్లు అంగీకరించారని, బంగ్లాదేశ్‌కు వెళ్లేందుకు ఏర్పాట్లు చేస్తున్నారని, ఒకవేళ అలా జరగకుంటే, కాన్పూర్‌లో భారత్‌తో జరిగే టెస్టు తనకు చివరిదని తెలిపారు. ఇటీవల బంగ్లాదేశ్‌లో షకీబ్ హసన్‌పై మర్డర్ కేసు నమోదు అయిన విషయం తెలిసిందే.



# బుమ్రా రికార్డులన్నింటినీ తిరగరాస్తాడు

### జహీర్ ఖాన్

**న్యూఢిల్లీ:** టీ20 వరల్డ్ కప్‌లో జస్ప్రిత్ బుమ్రా మిరాకిల్ చేసిన విష యం తెలిసిందే. ఫైనల్ మ్యాచులో సౌతాఫ్రికాను ముప్పు తిప్పలు పెట్టడమే కాకుండా పొదుపుగా బౌలింగ్ చేసి, సరైన టైంలో కీలక వికెట్లు తీసి టైటిల్ నెగ్గడంలో కీలకపాత్ర పోషిం చాడు. తాజాగా బంగ్లాతో జరుగుతున్న టెస్టు మ్యాచులోనూ బుమ్రా సత్తా చాటుతున్నాడు. ఈ క్రమంలోనే బుమ్రాపై భారత జట్టు మాజీ పేసర్ జహీర్ ఖాన్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. అంతర్జాతీయంగా 400లకు పైగా వికెట్లు తీసిన 6వ భారత ఫాస్ట్ బౌలర్‌గా బుమ్రా నిలిచిన విషయం తెలిసిందే. అతని కంటే ముందు కపిల్ దేవ్ (687), జహీర్ ఖాన్ (597) ఉన్నారు. 'బుమ్రా ప్రస్తుతం 3 ఫార్మాట్లలో కలిపి 402 వికెట్లు పడగొట్టాడు. అయితే, బుమ్రా తన ఫిట్‌నె స్‌ను ఇలాగే కొనసాగిస్తే భవిష్యత్తులో రికార్డులన్నింటినీ తిరగరాస్తాడు. అతని బౌలింగ్ శైలి ప్రత్యేకం.. ప్రపంచంలోనే అత్యుత్తమ బౌలర్ తనే. ఫిట్‌నెస్‌పై కఠిన శ్రమ పెడితే చాలు. కెరీర్‌లో 400ం వికెట్లు తీయడం సాధారణ విషయం కాదు. పేసర్‌కు అత్యంత కష్టమైనది. బుమ్రా ఇలాగే ఆడితే.. భవిష్యత్తులో మరిన్ని రికార్డులను బద్దలు కొడతాడు. ప్రస్తుతం ఉన్న పేసర్లలో తనే నెంబర్ వన్ బౌలర్. అయితే, తన శరీరాన్ని చాలా జాగ్రత్తగా చూసుకోవాలి. ఫిట్‌నెస్‌పై నిరంత రం శ్రమించాలి. ఎంత ఎక్కువగా ఆడితే.. అన్ని రికార్డులను అధిగమిస్తాడు. భారత్ పిచ్‌లపై పేస్‌ను రాబట్టడం సులువేం కాదు. కానీ, బుమ్రా వంటి వరల్డ్ క్లాస్ ప్లేయర్‌కు పరిస్థితులతో సంబంధమే లేదు. యార్కర్లు, స్లో డెలివరీలతో ప్రత్యర్థి బ్యాటర్లను ముప్పుతిప్పలు పెట్టేస్తాడు' అని జహీర్ కొనియాడారు.

# ప్రజానావ

ప్రతి అక్షరం జనం కోసం..

10 శుక్రవారం 27 సెప్టెంబర్ 2024




## అలియా భట్ 'జిగ్రా' ట్రైలర్ రిలీజ్

ఎ రాకీ ఔర్ రాణి కి ప్రేమ్ కహానీ వంటి బ్లాక్ బస్టర్ తర్వాత బాలీవుడ్ నటి అలియా భట్ నటిస్తున్న తాజా చిత్రం 'జిగ్రా'. ఈ సినిమాను ధర్మ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై కరణ్ జోహార్, అపూర్వ మెహతా, అలియా భట్, షాహీన్ భట్ - సోమెన్ మిశ్రా సంయుక్తంగా నిర్మిస్తుండగా.. మౌనిక ఓ మై డార్లింగ్ సినిమా ఫేం వసన్ బాల దర్శకత్వం వహిస్తున్నాడు. ఈ సినిమా దసరా కానుకగా అక్టోబర్ 11న విడుదల కానుంది. విడుదల తేదీ దగ్గర పడటంతో ఇప్పటికే మూవీ నుంచి టీజర్‌ను విడుదల చేయగా.. మంచి రెస్పాన్స్ తెచ్చుకుంది. ఇదిలావుంటే తాజాగా ట్రైలర్‌ను విడుదల చేశారు. ఈ ట్రైలర్ చూస్తుంటే.. బ్రదర్, సిస్టర్ సెంటిమెంట్‌తో ఈ సినిమా రాబోతున్నట్లు తెలుస్తుంది. రాఖీ కట్టి తన అక్కకు ఏ కష్టం వచ్చిన చూసుకుంటాను అంటారు సోదరులు. కానీ ఇక్కడ తన తమ్ముడికి కష్టం వస్తే.. అతనికి ఎలాంటి హానీ జరగకుండా కాపాడుకుంటానని అలియా భట్ ఒక అక్కగా ప్రమాణం చేస్తుంది. అయితే అసలు తన తమ్ముడికి వచ్చిన కష్టం ఏంటి. అక్కగా అలియా ఏం చేసింది అనేది తెలియాలంటే సినిమా చూడాల్సిందే. 'ఆర్చీస్' చిత్రంలో కీలక పాత్ర పోషించినవేదాంగ్ రైనా అలియా భట్ తమ్ముడిగా నటిస్తుండగా.. టాలీవుడ్ నటుడు రాహుల్ రవీంద్రన్ కీలక పాత్ర పోషిస్తున్నాడు.




## ఎమర్జెన్సీకి లైన్ క్లియర్ అయ్యే చాన్స్

### సున్నిత అంశాలు తొలగించాలని సూచన

కంగనా రనౌత్ నటించిన 'ఎమర్జెన్సీ' చిత్రం విడుదలకు లైన్ క్లియర్ అయ్యేలా కనిపిస్తోంది. చిత్ర విడుదలకు కేంద్ర సెన్సార్ బోర్డ్ బ్రేకులు వేసిన విషయం తెలిసిందే. ముందస్తుగా ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం ఈ సినిమా ఈ నెల 6న విడుదలకావాల్సి ఉంది. 1975-77 నాటి ఎమర్జెన్సీ పరిస్థితుల నేపథ్యంలో తెరకెక్కించిన ఈ సినిమా లో కంగనా రనౌత్.. మాజీ ప్రధాని ఇందిరాగాంధీ పాత్రను పోషించింది. అయితే ఈ సినిమాలో సిక్కుల మనోభావాలను కించపరిచే సన్నివేశాలు ఉన్నాయని, ఆపరేషన్ బ్లూస్టార్ నేపథ్యంలో తీసిన సన్నివేశాలు వివాదాస్పదంగా ఉన్నాయని సెన్సార్ బోర్డ్ విడుదలకు అనుమతిని నిరాకరించింది. దీంతో కంగన టీమ్ బాంబే హైకోర్టును ఆశ్రయించింది. దీనిపై విచారణ చేపట్టిన కోర్టు సెన్సార్ సర్టిఫికెట్ విషయంలో సెప్టెంబర్ 25లోగా ఒక నిర్ణయానికి రావాలని సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్‌ను ఆదేశించింది. ఈ నేపథ్యంలోనే తాజాగా ఈ అంశంపై హైకోర్టులో గురువారం విచారణ జరిగింది. సినిమాలో కొంత సున్నితమైన కంటెంట్ ఉందని.. వాటిని తొలగిస్తే సర్టిఫికెట్ ఇస్తామని సెన్సార్ బోర్డు కోర్టుకు తెలియజేసింది. దీంతో నిర్మాణ సంస్థ సెన్సార్ బోర్డు సూచనలపై నిర్ణయం తీసుకోవడానికి సమయం కోరింది.

అనంతరం తదుపరి విచారణను సెప్టెంబర్ 30కి వాయిదా వేసింది. ఈలోగా నిర్ణయం తీసుకోవాలని నిర్మాణ సంస్థను కోర్టు ఆదేశించింది. ఈ పరిణామాలతో 'ఎమర్జెన్సీ' విడుదలకు త్వరలో చిక్కులు తొలుగుతాయని సినీ వర్గాలు భావిస్తున్నాయి.



## హాలీవుడ్ స్థాయిలో దేవర

### మ్యూజిక్ డైరెక్టర్ అనిరుధ్ కితాబు

ప్రపంచవ్యాప్తంగా ఉన్న తన అభిమానులు, సినీ ప్రియులను అలరించేందుకు ఎన్టీఆర్ 'దేవర'తో సిద్ధమయ్యారు. యంగ్‌టైగర్ జూనియర్ ఎన్టీఆర్, బాలీవుడ్ భామ జాన్వీ కపూర్ జంటగా నటించిన ఈ సినిమా రికార్డు స్థాయిలో ప్రీ సేల్స్ రాబట్టి అంచనాలను అమాంతం పెంచేసింది. ఎన్టీఆర్ నుంచి దాదాపు ఆరేళ్ల సుదీర్ఘ గ్యాప్ తర్వాత వస్తున్న సోలో సినిమా ఇదే కావడంతో అభిమానులు కూడా ఈ మూవీపై చాలా ఆశలు పెట్టుకున్నారు. కొరటాల శివ దర్శకత్వంలో దేవర' శుక్రవారం ప్రేక్షకుల ముందుకు రానుంది. దీంతో ఈ సినిమాకు సంబంధించిన ప్రతి వార్త అభిమానుల్లో ఆసక్తిని పెంచుతోంది. తాజాగా ఈ చిత్రానికి సంగీతం అందించిన అనిరుధ్ ఓ ఇంటర్వ్యూలో ఆసక్తికర విషయాలు పంచుకొని అంచనాలను రెట్టింపు చేశారు. 'బ్యాగ్రౌండ్ మ్యూజిక్ అందించే సమయంలో నేను ఆశ్చర్యపోయాను. ఇంత గొప్పగా సినిమాను ఎలా తెరకెక్కించారని ఆలోచిస్తూనే ఉన్నా. ఇది అద్భుతమైన యాక్షన్ డ్రామా. ఇలాంటి సినిమాలకు నేపథ్య సంగీతం అందించాలంటే మంచి ప్రయోగాలు చేయొచ్చు. ప్రేక్షకులకు ఫ్రెష్ అనుభూతిని కలిగించాలనే ఉద్దేశంతో 95 శాతం రీరికార్డింగ్ పనులను విదేశాల్లోనే పూర్తి చేశాం. 'దేవర' సినిమా చూస్తున్నప్పుడు మీకు 'అవెంజర్స్', 'బ్యాట్‌మ్యాన్' వంటి హాలీవుడ్ సినిమాలు చూసిన అనుభూతి కలుగుతుంది. ఈ సినిమాలో సంగీతానికి ప్రత్యేక స్థానం ఉంది. ఇందులో ఎమోషన్, డ్రామా, యాక్షన్, ఆవేశం, అన్నీ ఉన్నాయి. థియేటర్‌కు వచ్చిన ప్రేక్షకులు అద్భుతమైన అనుభూతిని పొందుతారు. ఈ సినిమాను ఫస్ట్ డే, ఫస్ట్ షో చూడాలనుకుంటున్నా. కొరటాల శివ నన్ను హైదరాబాద్‌లో ఏ థియేటర్‌కు తీసుకెళ్లినా నాకు ఇష్టమే. అభిమానులతో కలిసి ఈ సినిమా చూడాలని కోరుకుంటున్నా. మేము ఈ సినిమాను ఎంత ఎంజాయ్ చేశామో వారు కూడా అదేస్థాయిలో ఎంజాయ్ చేస్తారని ఆశిస్తున్నా' అని చెప్పారు. ఈ సినిమాతో జాన్వీ కపూర్ తెలుగు తెరపై మెరవనున్నారు. ఎన్టీఆర్ ద్విపాత్రాభినయంలో కనిపించనున్న ఈ చిత్రంలో బాలీవుడ్ నటుడు సైఫ్ అలీఖాన్ విలన్‌గా నటించారు. నందమూరి కల్యాణ్ రామ్ ఈ సినిమాకు నిర్మాతగా వ్యవహరించారు.

## ఐశ్వర్య లుక్స్ సూపర్..

ఐశ్వర్య రాజేష్ తెలుగు, తమిళ చిత్రాలతో పాటు మలయాళం ల్లో ప్రధానంగా పనిచేసే నటి. ఐశ్వర్య నాలుగు సౌత్ ఇండియన్ ఇంటర్నేషనల్ మూవీ అవార్డ్స్, ఒక ఫిలింఫేర్ సౌత్ అవార్డు, ఒక తమిళనాడు స్టేట్ ఫిల్మ్ అవార్డ్ అందుకుంది. ఎప్పుడు సోషల్ మీడియాలో యాక్టీవ్ గా ఉంటూ అభిమానాలను ఆకట్టుకుంటుంది. తాజాగా ఇంటర్నెట్ లో ఈమె షేర్ చేసిన ఫోటోలు తెగ వైరల్ చేస్తున్నారు కుర్రాళ్లు. 10 జనవరి 1990న తమిళనాడు రాష్ట్ర రాజధాని చెన్నైలో ఓ తెలుగు కుటుంబంలో జన్మించింది అందాల తార ఐశ్వర్య రాజేష్. ఆమె తండ్రి రాజేష్ తెలుగు నటుడు. ఐశ్వర్య చిన్నతనంలోనే చనిపోయాడు. ఆమె తల్లి నాగమణి నృత్యకారి ణి. ఈ వయ్యారి తల్లిదండ్రుల నలుగురు సంతంలో ఆమె చిన్నది. వీరిలో ఇద్దరు అన్నలు ఆమె యుక్తవయస్సులో మరణించారు. ఆమె తాత అమర్‌నాథ్ కూడా తెలుగు నటుడు. ఆమె అత్త శ్రీ లక్ష్మి 500 పైగా తెలుగు చిత్రాల్లో హాస్యనటిగా చేసింది. తిరుపతిలోని శ్రీ విద్యానికేతన్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో, చెన్నైలోని హెూలీ ఏంజెల్స్ ఆంగ్లో ఇండియన్ హయ్యర్ సెకండరీ స్కూల్‌లో చదివింది.తమిళనాడులో చెన్నైలోని ఇతిరాజ్ కాలేజ్ ఫర్ ఉమెన్ నుంచి బి.కామ్ లో డిగ్రీ పట్ట పొందింది ఈ వయ్యారి భామ. పేరుకు తెలుగమ్మాయి అయినప్పటికీ ఎక్కువగా తమిళ చిత్రాల్లో మాత్రమే నటించింది ఈ ముద్దుగుమ్మ. అక్కడ ఆమె స్టార్. 2019లో స్పోర్ట్స్ డ్రామా కౌసల్య కృష్ణమూర్తి చిత్రంతో తెలుగు చలనచిత్ర అరంగేట్రం చేసింది. ఈ బ్లాక్ బస్టర్ అయింది. ప్రస్తుతం వెంకటేష్, అనిల్ రావిపూడి కాంబోలో వస్తున్న ఓ తెలుగు లో కథానాయకిగా నటిస్తుంది. దీంతో పాటు కరుప్పర్ నగరం, మోహన్ దాస్, తీయవర్ కులైగల్ నడుంగ అనే తమిళ లతో పాటు అజయంతే రాండమ్, హేర్ అనే మలయాళీ చిత్రాల్లో నటిస్తుంది. అలాగే ఉత్తరాఖండ అనే ఓ కన్నడ లో కూడా ప్రధాన పాత్రలో కనిపించనుంది.




Printed, Published and Owned by **Adula Thirupathi,** Printed at Ramani Web Offset Printers, H.No 8-82/11/1, Auto Nagar, Bommakal Road, Village, mdl & Dist : Karimnagar 505001,Telangana State, Published from 2-5-23, Mudhiraj street,Vemulawada Town, mandal, Siricilla Dist, (Karimnagar Dist) 505302,Telangana State. **Editor: Adula Thirupathi.** Email: prajanaava@gmail.com. Phone No: 99484 33277. RNI NO : **TELTEL/2023/87657**